తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
02, జూలై, 2026



## వనపర్తి జిల్లాలో

## జులై 31 వరకు పోలీస్ యాక్ట్-1861 సెక్షన్ 30 అమలు

**- అనుమతి లేని సభలు, ర్యాలీలు, ధర్నాలకు నో.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



**వనపర్తి,బ్యూరో జులై 1 (జనంసాక్షి):** జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడం లక్ష్యంగా జులై 1 నుంచి జులై 31 వరకు పోలీస్ యాక్ట్-1861 సెక్షన్ 30 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు.

ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పరిధిలో ముందస్తు పోలీసు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, భారీ సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని, పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల భద్రత, ప్రశాంతత, సామాజిక శాంతిని కాపాడడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకున్నా సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**- ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 1(జనంసాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు"30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ జులై 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు.సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను,మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## వైద్య సిబ్బంది లేక అవస్థలు పడుతున్న రోగులు

**బెజ్జంకి,జులై 1,(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో సిబ్బంది కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం ఏఐవైఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందిచారు.ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ మాట్లాడుతూ 24 గంటల వైద్య సేవలు అందించాల్సిన పీహెచ్‌సీలో అవసరమైన సిబ్బంది లేకపోవడం వల్ల రోగులకు సకాలంలో చికిత్స అందడం లేదని అన్నారు.వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఆయుష్ మెడికల్ ఆఫీసర్,ఆయుష్ ఫార్మసిస్ట్,ఏఎన్ఎంలు,స్టాఫ్ నర్సులు,ఫార్మసిస్ట్,హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రోగులు పడుతున్న అవస్థల గురించి పరిపాలన అధికారి కి వివరించి తెలియజేశారు.జిల్లా అధికారులు వెంటనే స్పందించి సిబ్బంది కొరతను తీర్చాలని,లేనిపక్షంలో ప్రజలు,రోగులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐవైఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బోనగిరి శ్రావణ్ పాల్గొన్నారు.

# వైద్యులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి**



**సంగారెడ్డి ప్రతినిధి ,జూలై 1 (జనంసాక్షి):** జాగ్రుకత దినోత్సవం, డాక్టర్స్ డే సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్యులు పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫిషింగ్ లింకులు, కేవైసీ, సోషల్ మీడియా మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బాస్ స్కామ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి ఉన్నతాధికారుల పేరుతో డబ్బులు పంపించాలని కోరే సందేశాలను నమ్మొద్దని, ముందుగా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించి ధృవీకరించుకోవాలని తెలిపారు.

అనుమానాస్పద కాల్స్, లింకులు, సందేశాలకు స్పందించవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. బలమైన పాస్‌వర్డ్లు, ద్వి-దశ భద్రతా విధానాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సైబర్ నేరాల వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తొలి గంటలో ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్స్పెక్టర్ కె.ఎస్. రవి, ఐటీ సెల్ సీఐ నిరంజన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. వినయ్ రెడ్డి, డీ4సీ బృందం, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ల సేవలు అమూల్యం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**సదాశివపేట జూలై 1(జనంసాక్షి):**జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వైద్యులు, వైద్య సిబ్బందిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులదే కీలకపాత్ర అని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ రోగుల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్న వైద్యులు కనిపించే దేవుళ్లని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడడంలో వైద్యుల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చింతా గోపాల్, చీల మల్లన్న, సుధీర్ రెడ్డి, ముబీన్,వైద్యులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ గడ్డపై సీఎం రేవంత్ అడుగులు.. అభివృద్ధి వరాలపై భారీ ఆశలు



**మిడ్జిల్, బ్యూరో జులై 1 (జనంసాక్షి):** జూలై 4న సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి మిడ్జిల్ మండల కేంద్రానికి రానున్న నేపథ్యంలో అభివృద్ధిపై ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. మిడ్జిల్ ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలతోనే తన రాజకీయ ప్రస్థానం కొనసాగిందని సీఎం పలుమార్లు పేర్కొన్నారని గుర్తు చేశారు. ప్రజల రుణం తీర్చుకునే సంకల్పంతోనే సీఎం మిడ్జిల్ పర్యటనకు వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఉమ్మడి మిడ్జిల్-ఉర్కొండ మండలాల అభివృద్ధికి భారీ నిధులు, పలు కీలక ప్రాజెక్టులపై సీఎం ప్రకటనలు చేసే అవకాశం ఉందన్నారు. జూలై 4న జరిగే భారీ బహిరంగ సభ మిడ్జిల్ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని పేర్కొన్నారు. సభకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాసుకో

## పోలీస్ డ్యూటీ మిట్ లో పోలీసు అధికారులు ఉత్సాహంగా పాల్గొనాలి

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01(జనంసాక్షి):** అధికారులు, సిబ్బంది పోలీస్ డ్యూటీ మీట్ లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా స్థాయి మూడో పోలీస్ డ్యూటీ మీట్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీసు అధికారులు, సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకే పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధుల్లో రాణించాలంటే నేర దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ, సాక్ష్యాధారాల పరిరక్షణ, నాణ్యమైన దర్యాప్తు కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, సాక్ష్యాధారాల నిర్వహణ, బాంబు నిర్వీర్యం, పోలీస్ జాగిలాల ట్రాకింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐలు సురేష్, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్రోల్మెంట్(చేరికలు) పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**శ్రీ రంగాపూర్ జూలై 1 (జనంసాక్షి):** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యను ప్రాధాన్యతగా బోధించాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా కార్యక్రమాలు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్), ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, ఏఐ తరగతుల నిర్వహణ, అపార్ (APAAR) ఐడీల నమోదు, కొత్తగా చేరిన విద్యార్థుల యూడైస్ (UDISE) వివరాల నమోదు వంటి అంశాలపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య పెంపునకు తల్లి దండ్రుల సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఏఐ తరగతులను క్రమబద్ధమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ప్రతి విద్యార్థి తనసొంత ఐడీ ద్వారా శిక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం శ్రీరంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి వంటశాలను తనిఖీ చేసిన కలెక్టర్ నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం స్టాక్ రూమ్ సందర్శించి మెస్ కమిటీ నిర్వహణ కొనసాగుతుందా లేదా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్లు మెస్ కమిటీ విద్యార్థుల సంతకాల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం, వసతుల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, గత విద్యా సంవత్సరంలో సీనియర్స్ సాధించిన 100 శాతం ఉత్తీర్ణతను స్ఫూర్తిగా తీసుకొని, ఈ ఏడాది కూడా విద్యార్థులు 100% ఉత్తీర్ణులు అయ్యేలా లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠ్యపుస్తకాల పంపిణీని పూర్తి చేయడంతో పాటు కంప్యూటర్ తరగతులను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామ సర్పంచ్‌తో గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యలు తదితర అంశాలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు.

పెబ్బేరు మున్సిపాలిటీ చెలిమిల్లలో పాఠశాల తనిఖీ పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అసంపూర్తిగా ఉన్న అదనపు పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం వినియోగంలోకి రావడానికి అవసరమైన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటుక పనులు (బ్రిక్ వర్క్) పూర్తి చేసి భవనాన్ని త్వరగా వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జెడ్పి సీఈవో యాదయ్య, శ్రీరంగాపూర్ సర్పంచ్ మద్దిలేటి, తాసిల్దారు వరలక్ష్మి మండల విద్యాశాఖ అధికారి హనుమంతు, కస్తూరిబా ప్రిన్సిపల్ వాణి, ఇతర మండల అధికారులు తదితరులు కలెక్టర్ ఉన్నారు.

# వివక్ష లేని సమసమాజమే లక్ష్యం : అజిత్ కుమార్



**గద్వాల, జులై 1(జనంసాక్షి):** గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవం గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక జాడ్యాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను అనుభవించాలని గద్వాల మండల నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చట్టాలపై అవగాహన, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలు, రక్షణల గురించి దళిత సోదరులకు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానులేనని, దళిత వర్గాల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామంలోని దళితులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మరియు భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్థిక, సామాజిక సాధికారత సాధించడానికి విద్యాభ్యాసమే ఏకైక మార్గమని, పిల్లలందరినీ ఉన్నత చదువులు చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లేడుబండ గ్రామ రెవెన్యూ అధికారి , పంచాయతీ కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు, మరియు గ్రామ పెద్దలతో పాటు కాలనీ మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఎం శ్రీ శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ - అధికారులు



**శ్రీరంగాపూర్ జూలై 1 (జనంసాక్షి):** పీఎంశ్రీ రంగాపూర్ ప్రాథమిక పాఠశాలను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సందర్శించారు. వారితో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి పి. యాదయ్య , మండల తహసిల్దార్ వరలక్ష్మి , మండల విద్యాధికారి గౌరవనీయులు టి. హనుమంతు , గ్రామ సర్పంచ్ ముంత మద్దిలేటి ,అకడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది ,జిల్లా సెక్టోరియల్ అధికారులు శేఖర్ , ఇందిర ,మండల సబ్ ఇన్స్పెక్టర్ హిమబిందు తదితరులు సందర్శించారు. గౌరవ జిల్లా కలెక్టర్ పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల హాజరు పట్టీలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్సీ ఎఫ్ ఆర్ ఎస్ యాప్ లో నమోదైన వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల, విద్యార్థుల వివరాలను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించి 5వ తరగతి పూర్తయిన విద్యార్థులు మరియు నూతనంగా పాఠశాలలో అడ్మిషన్ పొందినటువంటి విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారందరినీ పూర్తిగా యుడైస్ ప్లస్ పోర్టల్ లో అప్లోడ్ చేసి త్వరగా అపార్ ఐడీలను క్రియేట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల మౌలిక వసతులను కనుక్కొని అసంపూర్తిగా ఉన్న కశీపౌండ్ వాల్ ని తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. మూడు, నాలుగు మరియు ఐదవ తరగతి లోని చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఏఎక్సెల్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. గ్రామంలో ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు గౌరవ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారిని శాలువాతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు వసంతపురం రాజు, కే దామోదర్ బాబు , బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు , ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ బేగం, ప్రియ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ప్రకృతమ్మ, ఆయా రత్నమాల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సిటిజన్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పాటల పోటీల నిర్వహణ సీఈఓ రవిప్రసాద్



**శ్రీరంగాపూర్ జూలై 1 (జనంసాక్షి):** సిటిజన్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో విద్యార్థుల పాటల పోటీల నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు విద్యార్థులు దాగి ఉన్న ప్రతిమను గెలికి తీయడంతో పాటు వారి కళలను ప్రోత్సహించే లక్ష్యంతో సిటిజన్ న్యూస్ ఛానల్ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సమాజానికి సేవలు అందించే కార్యక్రమంలో చేపట్టడం ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సృజనాత్మకత వెలికి తీసి వారి ప్రతిభకు మరింత ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో బహుమతులు ప్రధానం చేస్తారు. భవిష్యత్తులో మనం విజయాలు సాధించాలని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు ఉత్సాహము నింపడంతో పాటు వారి ప్రతివను సమాజానికి పరిచయ వేదిక కాగలదని సిటిజన్ న్యూస్ ఛానల్ సీఈఓ రవిప్రసాద్ తెలియజేశారు.

# విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

**- అమరచింతలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటీయు రైతు సంఘం, ఆధ్వర్యంలో రాస్తారోకో**



**అమరచింత జూలై 1 (జనంసాక్షి):** విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దుచేసి పాత ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటీయు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరచింతలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్, సిఐటీయు జిల్లా అధ్యక్షులు ఆర్యన్ రమేష్, రైతు సంఘం జిల్లా కోశాధికారి బి వెంకటేష్, మాట్లాడుతూ వామ పక్షాల ఒత్తిడితో ఆనాటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నేడు వి బి జి రామ్ గారి పేరు మార్చి కేంద్రం 90 శాతం నిధులు 60% కి తగ్గించడం రాష్ట్రాలు భరించే పది శాతం , నిధులను నుంచి కూడా 40 శాతం కు పెంచడం సరికాదని పాత పద్ధతి ప్రకారం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వాలు లోటు బడ్జెట్ తో నిధులు కేటాయించని పరిస్థితి దాపురించింది అని అన్నారు, ఏడాదిలో రెండు నెలలు ఉపాధి పనులను విరామం ప్రకటించడం సరికాదని ఏడాది మొత్తంలో పనులు కల్పించాలని కోరారు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో నాయకులు కె శంకర్, ఎస్ రాజు, రవి ప్రకాష్, సునీల్. ఆర్ ఎన్ నాగరాజు, బెక్కం విష్ణు, బిల్లాతదితరులు పాల్గొన్నారు,

## లక్నారం పాఠశాలలో ఆకస్మిక తనిఖీ..

**- నెలలోగా కొత్త వంటగది నిర్మాణానికి ఆదేశం**

**- మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి**



**తెలకపల్లి, జూలై 01, (జనంసాక్షి):** మండల పరిధిలోని లక్నారం గ్రామ ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యా, పరిపాలన, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా పాఠశాల ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల నమోదు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల గ్రాంట్లతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని పరిశీలించారు. విద్యా సంవత్సరంలో ఇప్పటికే 40 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల వంటగదిని పరిశీలించిన ఎంఈఓ, అది శిథిలావస్థలో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి, మండల అభివృద్ధి అధికారితో సమన్వయం చేసుకుని గ్రామపంచాయతీ నిధులతో నెల రోజుల్లోగా కొత్త వంటగదిని నిర్మించాలని ఆదేశించారు. దీనికి స్పందించిన సర్పంచ్, నిర్దేశించిన గడువులోనే వంటగది నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో విద్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన స్పష్టం తెలిపారు.

## జీడిపల్లి తండాలో అంగన్వాడి భవన నిర్మాణానికి సర్పంచ్ భీమ్లా నాయక్ ప్రత్యేక చొరవ

**- చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేస్తున్న గ్రామ పంచాయతీ**
**- త్వరలో అందుబాటులోకి రానున్న ఆధునిక అంగన్వాడి కేంద్రం**





**కల్వకుర్తి,జులై 1,(జనంసాక్షి):** కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి తండాలో అంగన్వాడి భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి అని జీడిపల్లి తాండ సర్పంచ్ బిమ్లా నాయక్ తెలిపారు.గ్రామ సర్పంచ్ భీమ్లా నాయక్ ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ నిర్మాణం తండా ప్రజల్లో ఆనందాన్ని నింపుతోంది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుండగా,నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడకుండా పనులు జరుగుతున్నాయని సర్పంచ్ బిమ్లా నాయక్ తెలిపారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే చిన్నారులకు సురక్షిత వాతావరణంలో విద్య, పోషకాహార సేవలు లభించనున్నాయి.అలాగే మహిళలకు అవసరమైన ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పడనున్నాయి. పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘనంగా తెలంగాణ రక్షణ సేనజెండా ఆవిష్కరణ



**మల్దకల్,జులై 1(జనంసాక్షి):** సామాజిక న్యాయమే తెలంగాణ రక్షణ సేనటిఆర్ఎస్ పార్టీ లక్ష్యమని, ప్రజా సమస్యలపై టిఆర్ ఎస్ పార్టీ నిరంతరం ప్రశ్నిస్తూ, సమస్యల పరిష్కారానికై కృషి చేస్తుందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు జోగులాంబ గద్వాల జిల్లా ఇంచార్జి గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు. బుధవారం మల్దకల్ మండల కేంద్రంలోని స్వయం భూలక్ష్మీ తిమ్మప్ప స్వామిని దర్శించుకొని తెలంగాణ రక్షణ సేన నూతన పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్.బిఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్. జయశంకర్ చిత్రపటాలకు పూజ నిర్వహించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజల కోసం, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అమరవీరులు తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలు నెరవేర్చే ఉద్యమ పార్టీగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని అన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేన తెలంగాణ ప్రజల కోసం త్వరలోనే టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణసేన పార్టీనాయకులు వెంకట్రాములు, లవన్న, మల్దకల్, మండలనాయకులు బి.విష్ణు, గోపాల్, ప్రేమ్ రాజ్,గ్రామ సర్పంచ్ మరియమ్మ కృష్ణ, ఉపసర్పంచ్ గుండన్న, ఉప్పరికృష్ణ, బీసన్న, మీసాలకిష్టన్న, గోపాల్, నాయకులు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గణితం బోధించిన ఎంఈఓ



**కేటీదొడ్డి, జులై 01 (జనంసాక్షి):** మండల పరిధిలోని పాగుంట ఎం.పి.యు.పి.ఎస్ పాఠశాల ను మండల విద్యాధికారి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థులతో ఎంతో ఇంటరాక్టివ్‌గా సంభాషిస్తూ, నల్లబల్లపై స్వయంగా లెక్కలు చేయిస్తూ వారిని ఉత్సాహపరిచారు. ముఖ్యంగా విద్యార్థులలో ప్రాథమిక గణిత సామర్థ్యాలను అంచనా వేసేందుకు 'ఎఫ్ఎల్ఎన్ – న్యూమరసీ స్కిల్స్'స్థాయిని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా కృత్యాధార బోధన ద్వారానే గణితాన్ని అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, వారిపై అదనపు శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమ టీచర్స్ డైరీని ప్రతిరోజూ విధిగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి యుగంధర్, పాఠశాల ఉపాధ్యాయులు రఘు, శ్వేత, నయీమా, సునీత తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం.. బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి



**శ్రీరంగాపూర్ జూలై 1 (జనంసాక్షి):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి గారి దృష్టికి కంబాలాపురం గ్రామానికి చెందిన మేకల ప్రవీణ్ ఆరోగ్య పరిస్థితిని కాంగ్రెస్ నాయకులు తీసుకువెళ్లగా, ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి అత్యంత మానవత్వంతో వెంటనే స్పందించి సహాయహస్తం అందించారు.శ్రీరంగాపూర్ మండలం కంబాలాపురం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య గారి కుమారుడు ప్రవీణ్ కిడ్నీ సంబంధిత తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం సుమారు రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు మేకల అశోక్ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లగా, ప్రజల కష్టాల్లో ముందుండే నాయకుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి కేవలం మూడు రోజుల వ్యవధిలోనే రూ.6 లక్షల విలువైన ఎల్‌ఓసీ (గూజ) మంజూరు చేయించి తన సేవా దృక్పథాన్ని మరోసారి చాటిచెప్పారు.ఈ సహాయంలో భాగంగా:పేషెంట్ మేకల ప్రవీణ్ చికిత్స కోసం రూ.4 లక్షలు,కిడ్నీ డోనర్ అయిన ఆయన తల్లి మేకల ఈశ్వరమ్మ వైద్య సహాయం కోసం రూ.2 లక్షలు,మొత్తం రూ.6 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయడం జరిగింది.

కంబాలాపురం కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, "మా కష్ట సమయంలో దేవుడిలా నిలబడి మా కుటుంబానికి ప్రాణాధారమైన సహాయం అందించిన ఎమ్మెల్యే గారికి జీవితాంతం రుణపడి ఉంటాము" అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, బాధలో ఉన్న కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి గారి సేవా భావానికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.ఈ కార్యక్రమంలో మేకల వెంకటస్వామి, మల్లేష్, మేకల అశోక్, ఎరుకల తాతయ్య, బోయ కృష్ణయ్య, బోయ నందు తదితరులు పాల్గొన్నారు.

## లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

**- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో... పిల్లర్లు మిగిల్చారా?**
**- జీడిపల్లి తండా ప్రజల ఆశలపై కాంట్రాక్టర్ గుదిబండ!**
**- గ్రామపంచాయతీ భవనం ఎక్కడ?.. పిల్లర్లే కనిపిస్తున్నాయే!**



**కల్వకుర్తి,జులై 1,(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి తండా గ్రామంలో ప్రజల అవసరాల కోసం నిర్మించాల్సిన గ్రామపంచాయతీ భవనం నేడు కాంట్రాక్టర్, అధి కారుల, నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలిచిందని గ్రామస్తులు మండిపడు తున్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో లక్షలాది రూపాయల ప్రజా ధనంతో ప్రారంభించిన భవన నిర్మాణం నేటికీ పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఒకప్పుడు అధికారుల హడావిడి,నాయకుల ఫోటో సెషన్లతో ప్రారంభమైన ఈ భవనం ప్రస్తుతం కేవలం పిల్లర్లకే పరిమితమై ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పనులు ఎందుకు ఆగిపోయాయి? నిధులు ఎక్కడికి వెళ్లాయి? కాంట్రాక్టర్ ఎందుకు కనిపించడం లేదు? అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

గ్రామస్తుల కథనం ప్రకారం, నిర్మాణం ప్రారంభమైన కొద్ది రోజులకే పనులు నత్తనడకన సాగి చివరకు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాలు, ఎండలకు గురవుతూ నిర్మాణ సామగ్రి పాడైపోతుండగా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం లేక ప్రజలు చిన్నచిన్న పనుల కోసం ఇబ్బందులు పడుతున్నా, బాధ్యులెవరూ పట్టించుకోవడం లేదని స్థాని కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చు చేశామని చెప్పుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పుడు ఈ అసంపూర్తి నిర్మాణంపై ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయించాలని, ప్రజాధనం దుర్వినియోగం జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జీడిపల్లి తండా ప్రజలు కోరుతున్నారు.లేదంటే ఈ పిల్లర్లే అభివృద్ధి పేరుతో జరిగిన నిర్లక్ష్యానికి శాశ్వత సాక్ష్యాలుగా మిగిలిపోతాయని హెచ్చరిస్తున్నారు.

## విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలీ



**మాగనూర్ (జనంసాక్షి):** ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి మాగనూరు మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు ముందు వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడిఓ శ్రీనివాసులుకి మెమోరాండం ఇచ్చారు. అదే విధంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు, సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ వారు మాట్లాడుతూ జులై 1 నుండి విబిజి రాంజి చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోరాడి వామపక్షాలు మద్దతుతో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది ఉన్నారు. విబీజి రామ్‌జి చట్టాన్ని తెచ్చింది. 125 రోజులు పనిదినాలను ప్రచారం చేస్తున్నారు కానీ నిధు లు కేటాయింపు బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకున్నది అన్నారు. గతంలో 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చేది దానిలో 40% కోత పెట్టి 60 శాతం మాత్రమే ఇస్తారట. 40% నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్తున్నారు. వ్యవసాయ పనుల సీజన్ లో 60 రోజులు పని బంద్ చేయాలని కొత్త చట్టంలో ఉన్నది. కనీస వేతనాలు గురించి కొత్త చట్టంలో పేర్కొనలేదు. ఉదయం సాయంత్రం పని ప్రదేశంలో ఫోటోలు అప్లోడ్ చేయాలి ఫోటోలు అప్లోడ్ అయితేనే వేతనాలు వస్తాయి లేకపోతే రావు. పని గ్రామపంచాయతీ ఎంపిక చేసే అవకాశం దీనిలో లేదు. కేంద్ర ప్రభుత్వమే ఎప్పుడు ఎవరికి ఎక్కడ పని పెట్టాలి అనేది నిర్ణయిస్తారు . సీనియర్ మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు కొత్త చట్టం అమలు అయితే కొనసాగే అవకాశం ఉండదు అన్నారు. వారి ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉంది . కూలీల పని హక్కును హరించే కొత్త చట్టాన్ని మన గ్రామంలో లేదా మండలంలో అమలు చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నాశీ. కార్మికులందరికీ నష్టం కలిగించే లేబర్ కోడ్స్ అమలు చేయకూడదు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మంగలి అశోక్, ఎంపీఆర్డీ మండల అధ్యక్షులు పుంజనూరు బాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే నరసింహ, రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు నయీమ్, ఉపాధి హామీ నాయకులు కే విష్ణు, కూలీలు ఒంటెలి వెంకటయ్య ,బులిమిని తిప్పయ్య , నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం : డీఎస్పీ నల్లపు లింగయ్య

**- 180 ఇళ్లలో తనిఖీలు పత్రాలు లేని 55 వాహనాలు సీజ్**



**నారాయణపేట జిల్లా బ్యూరో్ జూలై 1(జనంసాక్షి):** ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని నారాయణపేట డీఎస్పీ లింగయ్య తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని భీమండి కాలనీలో బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 75 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీలోని180 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు,2ఆటోలు,2 కార్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

అదేవిధంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు. కొత్త వ్యక్తులు కాలనీలో నివాసం ఉంటే వారి వివరాలను స్థానిక పోలీసులకు తెలియజేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాములను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను గృహయజమానులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు,నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని ప్రజలకు సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాల సంబంధిత పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐలు ఏ వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, కృష్ణ చైతన్య, గాయత్రి, పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తు.. ఆపరేషన్ ముస్కాన్-12కు శ్రీకారం

**- వనపర్తిలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ.. బాల కార్మికులను నియమించే యజమానులపై కఠిన చర్యలు?**




**వనపర్తి బ్యూరో్, జూలై 1 (జనంసాక్షి):** జిల్లాలో బాలల రక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, బుధవారం శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం ఆపరేషన్ ముస్కాన్-12 వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "ఒక చిన్నారిని రక్షించడం అంటే ఒక కుటుంబానికి మళ్లీ వెలుగు నింపినట్లే. ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యం, విద్య, ప్రేమతో కూడిన భవిష్యత్తు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత" అని పేర్కొన్నారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం, భిక్షాటన చేస్తున్న చిన్నారులను గుర్తించి రక్షించడం, తప్పిపోయిన పిల్లలను వారి కుటుంబాలకు సురక్షితంగా చేర్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, హోటళ్లు, పరిశ్రమలు, వర్క్‌షాపులు, ఇటుక బట్టీలు, ప్రధాన కూడళ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగస్వామ్యమవుతున్న అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి చిన్నారి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

బాల కార్మికులను నియమించుకునే యజమానులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్పీ, తప్పిపోయిన చిన్నారులను త్వరితగతిన గుర్తించేదుకు ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతతో కూడిన దర్పన్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు తమ పరిసరాల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు లేదా తప్పిపోయిన పిల్లల సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత అధికారులకు తెలియజేసి ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతానికి భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీనాయక్, జిల్లా వైద్యాధికారి డా. సాయినాథ్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, షీ టీం-భరోసా ఎస్సై అంజద్, ఆపరేషన్ ముస్కాన్ టీం ఎస్సై వెంకటేశ్వర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి రవి, సఖి కోఆర్డినేటర్ కవిత, భరోసా కోఆర్డినేటర్ మమతతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**ఖిల్లా ఘనపురం ,01, జూలై, (జనంసాక్షి):** ప్రతి కుటుంబ కల సొంత ఇల్లు ఉండటం వారి కలను నెరవేర్చడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకున్న కలని మండల పరిధిలోని ఆగారం, అంతాయిపల్లి ,మహామదుసేన్ పల్లి గ్రామాలలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ లలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ,,,

పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం మొదటి దశ ఇందిరమ్మ ఇళ్లు నియోజక వర్గం లో దాదాపు 3500 ఇళ్లు పూర్తి కావొచ్చాయి అని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు చాలా సంతోషంగా ఉన్నారని లబ్ది దారుల ఇళ్లను సందర్శించి దంపతులకు పట్టు వస్త్రాలు అందించటం వారి కుటుంబంలో నన్ను ఓ అన్నగా భావించి మురిసిపోతున్నారని అన్నారు ఇప్పటికే కేవలం పట్టు వస్త్రాలకే దాదాపు కోటికి పైగా రూపాయలను వెచ్చించడం జరిగింది అని భవిష్యత్తులో మరో 10,000 ఇండ్లను ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు ఆయన వెంట డి సి సి ఉపాధ్యక్షులు టి సాయి చరణ్ రెడ్డి,సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత,సోలిపూర్ రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగొల్ల కృష్ణయ్య, మామిడిమడా వెంకట్రావు, ఆగారం సర్పంచ్ నర్సమ్మ, గోపి, జయకర్,కార్యదర్శి రవి తేజ రెడ్డి,నరేష్, బెస్త నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్



**నర్వ 1జూలై (జనంసాక్షి):** నర్వ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ సీహెచ్.ప్రియాంక మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించేందుకు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మంచి బోధన అందించాలని వంటగది ఎప్పటికి అప్పుడు శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారం పిల్లలకు అందించాలని, ఉపాధ్యాయ,బృందానికి సూచించారు,మంచిగా చదువుకొని తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకోని రావాలని శ్రద్ధగ చదవాలని విద్యార్థులకు సూచించారు.ఈకార్యక్రమంలో ఎమ్ఆర్ఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# నేటి కల్వకుర్తి మహాసభను విజయవంతం చేయాలని పిలుపు

**- డాక్టర్స్ డే సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీ,ఎమ్మెల్యే**



**కల్వకుర్తి,జూలై 1,(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నెల రోజులుగా గ్రామ గ్రామాన సాగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక బస్సు యాత్ర విజయవంతంగా పూర్తైందని, దీనికి ముగింపుగా నేడు కల్వకుర్తిలో నిర్వహించనున్న మహాసభను ప్రజలు, రైతులు, మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా హాజరై విజయవంతం చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన వారు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమని కొనియాడారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు విడుదల చేసిన నేపథ్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రైతు సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.

# మీటర్ రీడింగ్ సులభతరం చేసిన విద్యుత్‌శాఖ డిస్కమ్‌లు



**నారాయణపేట జూలై 1(జనంసాక్షి):** తెలంగాణ సదరన్ విద్యుత్ సంస్థ మీటర్ రీడింగ్ ను సులభతరం చేస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానం పై మీటర్ రీడర్స్ కు అవగాహన కల్పించేందుకు బుధవారం నారాయణపేట డిఈటి.రాజు నాయక్, ఏఈ. మహేష్ గౌడ్ లు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. మొదటగా డాటా డౌన్లోడ్ చేసిన తరువాత కొత్త ఆప్షన్ లో ఈ.ఆర్.ఓ. కోడ్ ఎంట్రీ చేయాలన్నారు. అనంతరం సెక్షన్ కోడ్ , స్ట్రక్చర్ కోడ్, డి.టి.ఆర్.కోడ్ ,ఈవిధంగా ఎంట్రీ చేసినట్లయితే ఫీడర్ మ్యాపింగ్, స్ట్రక్చర్ మ్యాపింగ్ అయిన తరువాత ఈ కొత్త యాప్ లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వటం ద్వారా వినియోగదారుల నూతన ఫోన్ నెంబర్ ను ఎంట్రీచేసే అవకాశం ఉంది.ఈ విధానంలో బిల్లుల పెండింగ్ బాకాయిలు వినియోగ దారుని ఫోన్ ద్వారా బిల్లులు త్వరగా వసూలు చేసేందుకు అవకాశం ఉందని డిఈటి రాజు నాయక్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ అవగాహన సదస్సు స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో స్పాట్ బిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ మహేష్ గౌడ్, స్పాట్ బిల్లర్లు పాల్గొన్నారు.

# బొప్పల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం

**- 10 మందికి గాయాలు**



**తెలకపల్లి, జులై 1, (జనంసాక్షి):** మండలంలోని బొప్పల్లి గ్రామంలో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో సంచరిస్తూ పలువురిపై దాడి చేసిన పిచ్చికుక్క 10 మందిని కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో పిచ్చికుక్క సంచరిస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కను పట్టుకుని గ్రామస్తులకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గాయపడిన వారి వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

**ఇటిక్యాల, జూలై 1 (జనంసాక్షి):** విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పాటించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటిక్యాల శాఖ జనరల్ మేజర్ రఘువీర్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ వరకు ప్రతి తరగతి నుండి ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన పదిమంది విద్యార్థులకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "స్టూడెంట్ ఎక్సలెన్స్ అవార్డు--2026" ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ రఘువీర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రేరణ కలుగుతుందన్నారు. విద్యలో ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులకు, మెరిట్ సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా మేనేజర్ రామావత్ చంద్రు, అసిస్టెంట్ మేనేజర్ ప్రభాకర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాగుంటన్న , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రజా సంక్షేమమే లక్ష్యం.. కల్వకుర్తి అభివృద్ధే ధ్యేయం

**- లబ్ధిదారులకు ఎల్‌వోసీలు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**- ప్రజాపాలన సభ ఏర్పాట్లపై అధికారులతో విస్తృత సమీక్ష**

**కల్వకుర్తి,జూలై 1,(జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా తన నివాసంలో నియోజక వర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎల్‌వోసీలు (లెటర్స్ ఆఫ్ కమిట్‌మెంట్) అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లా డిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం కల్వకుర్తి పట్టణంలో నిర్వహించనున్న ప్రజా పాలన సభ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సభా ప్రాంగణంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు,పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్,భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభ విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. తదనంతరం, కాంగ్రెస్ పార్టీ నాయ



కులు, కార్యకర్తలతో కలిసి పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి సమక్షంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లో ఆర్థికసాయం జమచేసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమం, ప్రజా అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కారల్ మార్క్స్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాళి

**- శ్రమజీవుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహా తత్వవేత్త : నిరంజన్ రెడ్డి**

**వనపర్తి రూరల్ / లండన్, జూలై 01, (జనంసాక్షి):** ప్రపంచ శ్రామిక వర్గ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత తత్వవేత్త కారల్ మార్క్స్ ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. లండన్ నగరంలోని హైగేట్ స్మశానవాటికలో ఉన్న కారల్ మార్క్స్ స్మారక స్థలాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించిన ఆయన, మార్క్స్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, శ్రమజీవుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం కారల్ మార్క్స్ చేసిన కృషి ప్రపంచానికి మార్గదర్శకమైందన్నారు. ఆయన ఆలోచన లు అనేక దేశాల సామాజిక, రాజకీయ, ఆర్థిక విధానాలపై విశేష ప్రభావం చూపాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మార్క్స్ భావజాలం స్ఫూర్తినిస్తోందని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు నేటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయని అన్నారు. కారల్ మార్క్స్ కేవలం ఒక తత్వవేత్త మాత్రమే కాకుండా, సమాజ మార్పు కోసం ఆలోచనలను కార్యరూపం లోకి తీసుకువచ్చిన మహోన్నత మేధావి అని కొనియాడారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని కారల్ మార్క్స్‌కు ఘనంగా నివాళులర్పించారు.



## శ్రీ ఎల్లమ్మ తల్లి పూజలో పాల్గొన్న ఫుడ్ కమిషన్ చైర్మన్



**వెల్దండ, జూలై 01 (జనంసాక్షి):** వెల్దండ మండలం గుండాల గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు కానువుల జోగయ్య, జంగిలి నిరంజన్, గుద్దేటి ప్రభాకర్, మంగళగిరి సత్యం,గుండాల మాజీ సర్పంచ్ మైసయ్య, చెర్కూర్ సర్పంచ్ బచ్చులకూర శ్రీనివాసులు, పురుగుల లాలయ్య ,వెంకటయ్య, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వసురం తండాలో నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

**- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా...**

**కొల్చారం, జూలై 1 (జనంసాక్షి):** కొల్చారం మండలం వసురం తండా అంసాన్‌పల్లి గ్రామ పంచా యతీలలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీ త లక్ష్మారెడ్డి బుధవారం పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభిం చారు. అంసన్ పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన ఆరు లక్షల రూపాయల సీసీ రోడ్లు, 10 లక్షల రూపాయల పాఠశాల ప్రహరీ గోడ పనులను ప్రారంభించారు. అనంతరం వసురం తండాలో సర్పంచ్ వినోద్ నాయక్ తో కలిసి నూతన పంచాయతీ భవనాన్ని కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ వినోద్ నాయక్ చురుకైన వాడని, పాలకవర్గం సభ్యులు సర్పంచ్ తో కలిసి తండా అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం బిఆర్‌యు సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, అంసాన్ పల్లి యువ నాయకుడు కన్నబోయిన రమేష్ జన్మదిన వేడుకలను టిఆర్ఎస్ నాయకుల సమక్షంలో జరిపించారు. వసురం తండా గ్రామపంచాయతీ ఆవరణలో కేక్ కట్ చేసి వారికి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ నాగ వర్ధన్, సెక్రటరీ ఫణీంద్ర కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, సీనియర్ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, కరెంట్ రాజా గౌడ్ ,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, బాగా రెడ్డి, సొసైటీ చైర్మన్ మన్నే రాములు,పోతంశెట్టిపల్లి గౌరీ శంకర్, సర్పంచులు పాల్గొన్నారు.



## మనోహరాబాద్‌లో భూముల రీసర్వే పై ప్రజలకు అవగాహన

**- సమావేశంలో ప్రజలకు అవగాహన కల్పించిన ఏడి కిషన్**

**- కబ్జాలో ఉన్న రైతులు అధికారులకు సహకరించాలి**

**- కబ్జాదారుల నుండి భూములకు రక్షణ**

**మనోహరాబాద్ జూలై 1(జనంసాక్షి) :** మెదక్ జిల్లా మనో హరాబాద్ రైతు వేదికలో భూముల రిసర్వేపై ప్రజలకు సుదీర్ఘ అవగాహన కల్పించిన జిల్లా ఏడి కిషన్ కబ్జాలో ఉన్న రైతులు అధికారులకు తప్పకుండా సహకరించాలి భూముల రీ సర్వే ద్వారా భూ కబ్జా దారుల నుండి భూముల రక్షణ కొరకు ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టింది ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమి మాయమవుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రత్యేక రీ సర్వే ద్వారా భూములను కాపాడే లక్ష్యంగా ముందుకు సాగు తుందని అధికారులు రైతులతో మమేకమై భూ సర్వే పై కులం కుశంగా అన్ని అంశాలపై సమగ్ర వివరణ సేకరిస్తారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనూషతో రైతులు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## స్వయం ఉపాధితో యువకులు ఆర్థికంగా ఎదగాలి

**- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**

**ఉర్కొండ, జూలై 01, (జనంసాక్షి);** స్వయం ఉపాధితో యువకులు ఆర్థికంగా ఎదగాలని కాబట్టి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బిజెపి రాష్ట్ర నాయకులు ముత్యాల జనార్దన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పానది బాలకృష్ణ ఏర్పాటు చేసుకున్న వీబీ ఫోటో స్టూడియోను బుధవారం రోజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలో స్టేజ్ దగ్గర శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన నూతన వే బిర్జ్ (కాంట) ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల అధ్యక్షులు సర్పంచులు మాజీ సర్పంచులు ఉప సర్పంచ్ లు ,మండల నాయకులు, వార్డు సభ్యులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భార్య మృతి .. భర్త పరిస్థితి విషమం

**పాపన్నపేట,టేక్మాల్, జులై 1 (జనంసాక్షి) :** భార్య మృతి చెందగా భర్త పరిస్థితి విష మంగా ఉంది. ఈ విషాద సంఘటన బుధవారం టేక్మాల్ మండలం బోడగట్టు గ్రామం పాపన్నపేట ఠాణా పరిధిలో జరి గింది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. మల్లయ్య గారి కవిత (35) సంగ మేష్ దంపతులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు అందరూ కలిసి భోజనాలు ముంగించుకుని ఇంటిలో నిద్రిస్తుండగా భార్యభర్తలు కవిత,సంగమేష్‌లకు నల్లకట్ల పాము కాటు వేసింది. దీంతో వారు కుటింబీకులకు సూచించడంతో పాము కాటుకు గురైన ఇరువురిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభత్వ ఆసుపత్రికీ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం భార్య కవిత మృతి చెందింది. భర్త సంగమేష్ పరిస్థితి విషమంగా ఉంది.




## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ**



**జడ్చర్ల, జూలై 1 (జనంసాక్షి):** ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని రెవెన్యూ అదనపు కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ స్పష్టం చేశారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, చేర్పులు మరియు తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం జాబితాను సిద్ధం చేస్తామని, ఈ ప్రక్రియలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ గిరీష్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ అలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్వరాల గ్రామంలో యువకుడు ఆత్మహత్య



**వీపనగండ్ల, జూలై 2(జనంసాక్షి):** వీపనగండ్ల మండల పరిధిలోని కాల్వరాల గ్రామానికి చెందిన బండారి గోవిందు (26), తండ్రి హుస్సేన్ తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు స్థానిక ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా గోవిందు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి తండ్రి బండారి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జె.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాథమిక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బంజారా జాతి అభ్యున్నతికి కృషి చేసిన ఆధ్యాత్మిక గురువు సంత్ తపస్వి రామ్ రావ్‌కు ఘన నివాళి



**హవేలీ ఘన్పూర్ మండలం, జూలై 1 (జనంసాక్షి):** బంజారా (లంబాడా) జాతి అభ్యున్నతికి, వారి ఆత్మగౌరవ పరిరక్షణకు విశేషంగా కృషి చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సంత్ తపస్వి రామ్ రావ్ మహారాజ్ అని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు కొనియాడారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండలంలోని ఔరంగాబాద్ తండా గేటు వద్ద నిర్వహించిన శ్రీశ్రీశ్రీ తపస్వి రామ్ రావ్ మహారాజ్, ప్రేమ్‌సింగ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంత్ తపస్వి రామ్ రావ్ మహారాజ్ తన జీవితాన్ని బంజారా సమాజం యొక్క సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి అంకితం చేశారని పేర్కొన్నారు. సమాజంలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందించడంతో పాటు మానవ బాధలను నివారించేందుకు తనవంతు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్, శ్రీ రామ్ రావ్ మహారాజ్ విగ్రహ కమిటీ సభ్యులు, ఔరంగాబాద్ తండా సర్పంచ్ కేతావత్ భూలి పుల్య నాయక్, స్కూల్ తండా సర్పంచ్ ముడావత్ గోపాల్, ముడావత్ రాంజా నాయక్, కేతావత్ బధ్య నాయక్, కేతావత్ సూర్య నాయక్, లింగసంపల్లి తండా సర్పంచ్ కేతావత్ శాంతి బాబు నాయక్, కేతావత్ పాండు, ధరావత్ మంగ్య, మలోత్ దేవుల, ముడావత్ చిన్య, తండా నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పేటలో పశువుల సంత పునః ప్రారంభించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 1(జనంసాక్షి):** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పశువుల సంత బుధవారం పునః ప్రారంభం అయింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజులతో కలిసి మార్కెట్ యార్డులో పశువుల సంతను ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ పాలక వర్గ సభ్యులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. పాలకవర్గం, అధికారులు ఈ నామ్‌ను సమర్థ వంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో బాలా మణి, మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్ వైజర్ లక్ష్మణ్, మార్కెట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీ పార్టీతోనే సాధ్యం

**అమరచింత జూలై 1 (జనంసాక్షి):** బహుజనులకు రాజ్యాధికారం బహుజన సమాజ్ పార్టీ తోనే సాధ్యమని నారాయణపేట జిల్లా మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కొక్కు గౌతం అన్నారు, ఈ సందర్భంగా బుధవారం మాట్లాడుతూ బహుజనులు అన్నగారికి వర్గాలన్నీటికి అధికారం దక్కాలంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు రాజ్యాంగం లో ఉన్న చట్టాలు ప్రజలకు నేరుగా అందాలంటే అది ఒక బహుజన సమాజ్ పార్టీ తోనే సాధ్యమని అన్నారు, అమరచింత పట్టణానికి చెందిన అజ్జపగా అశోక్ కుమార్ కి బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ రెండవ ఇంచార్జ్‌గా నియమించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ ఆత్మకూరు మండల అధ్యక్షులుగా గుడిసె శ్రీనివాస్ ని ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో ఉట్కూరు పట్టణ అధ్యక్షులు మహాదేవ్, కూపయ్య, పాల్గొన్నారు,

## సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**ఉర్కొండ, జూలై 01, (జనంసాక్షి);** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్ల నియోజకవర్గ పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఉర్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పోలీసు శాఖ అధికారులతో సమావేశమై భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం గారి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. ఎలాంటి లోపాలు లేకుండా చూడాలి. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు మౌలిక వసతులు, తాగునీరు, నీడ ఏర్పాట్లు సరిగా చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా, స్థానిక సర్పంచులు,డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

**- సాధన సమితి**



**జడ్చర్ల, జూలై 1 (జనంసాక్షి):** జడ్చర్ల నియోజకవర్గాన్ని తక్షణమే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన సమితి కో-ఆర్డినేటర్లు వడ్త్యావత్ రమేష్ నాయక్, బూర్గుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 4న మిడ్జిల్ మండలానికి రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించేందుకు, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి చొరవ చూపి సహకరించాలని కోరారు. జడ్చర్ల ప్రాంతం వ్యాపార, పారిశ్రామికంగా, పరిపాలనాపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, రెవెన్యూ డివిజన్ హోదా లేకపోవడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత పదేళ్లుగా ప్రజలు జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరుతున్నారని, ఈ ఆకాంక్షను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో సాధన సమితి నాయకులు భీమ్ రాజ్, బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, లింగంపేట శేఖర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

**- సాగునీటితో రైతుల శ్రేయస్సుకే ప్రాజెక్టుల నిర్మాణం**

**- తనగల గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ,జులై 1 (జనంసాక్షి);** పంటలు సమృద్ధిగా పండేందుకు సాగునీరు అవసరమని, అందుకే ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయంలో రైతులు సహకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విజ్ఞప్తి చేశారు.

బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ కోసం వడ్డేపల్లి మండలం తనగల గ్రామస్తులతో జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులు, ప్రాజెక్టులు, తదితర అభివృద్ధి జరిగేందుకు భూసేకరణ తప్పదని ఈ విషయాన్ని రైతులు అర్థం చేసుకుని తమ భూములను ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. మొదట తనగల గ్రామంలోని భవనాలు, చెట్లు, తదితర బౌండరీ సర్వే చేసేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు. ఆర్డీఎస్ పరిధిలోని తుంగభద్ర నది నీటిని అలంపూర్ నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి తుమ్మిళ్ల ఫేజ్ 1 ఎత్తిపోతల పథకంలో భాగంగా మలమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు కావలసిన 567 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినందున ఇప్పటికే గ్రామసభలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ విషయంలో తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ తాము వ్యవసాయం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నామని భూములు కోల్పోతే బ్రతుకుతెరువు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు భూములు ఇస్తే తమకు ప్రభుత్వ ఉద్యోగాలు, కోల్పోయిన భూమికి సమానంగా భూములను ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. మరికొందరు రైతులు ప్రస్తుతం ఆ భూమి విలువ ఆధారంగా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మరికొన్ని సమావేశాలు కూడా రైతులతో నిర్వహిస్తామని రైతులెవ్వరు అధైర్య పడకుండా సానుకూలంగా స్పందించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, వడ్డేపల్లి తహసిల్దార్ శివకుమార్, తనగల గ్రామ సర్పంచ్ వెంకటేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్



**నారాయణపేట, జూలై 1(జనంసాక్షి):** నారాయణపేట ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా డిపో మేనేజర్‌గా వచ్చిన ఆర్. రామ్మోహన్ బుధవారం నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌ని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిసి పూలమొక్కను అందచేశారు. అనంతరం జిల్లా ఎస్పీ డిపో మేనేజర్‌కు అభినంద నలు తెలియజేస్తూ, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడంలో పోలీసు శాఖ–ఆర్టీసీ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

### ఘనంగా జరిగిన ఎస్‌బిఐ 71వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు



**మహబూబ్‌నగర్,అర్బన్ జూలై 1 (జనంసాక్షి):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 71వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవ రణలోని ఎస్‌బిఐ శాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ కల్వ భాస్కర్, సీపీఓ రవీందర్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, బ్యాంకు అధికారులు,జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యకు ప్రభుత్వం కృషి



**ఇటిక్యాల,జూలై 1(జనంసాక్షి):** పూర్వ ప్రాథమిక విద్య ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని షాబాద్, వావిలాల, పెద్దదిన్నె గ్రామాలలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాల ద్వారా విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు గాను ఏర్పాటు చేసిన తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. 4-5 ఏళ్లలోపు చిన్నారులకు యూకేజీ తరగతులు బోధించేందుగాను ఇంటర్మీడియట్ తో ప్రభుత్వం శిక్షకులను నియమించింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెలలో దరఖాస్తులు స్వీకరించి గ్రామంలో ఉన్నవారికి అవకాశం కల్పించగా షాబాద్, పెద్దదిన్నె, వావిలాల గ్రామాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య నిరుపేదలకు భారం కాకుండా ప్రభుత్వం ఈ ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాగుంటన్న, హెచ్ఎం కరేంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల వివాహాలకు కాంగ్రెస్ సర్కార్ భరోసా

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, జూలై 1 (జనంసాక్షి):** పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని అంబేద్కర్ కళాభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఏ ఒక్క అర్హుడు కూడా సంక్షేమ పథకాలకు దూరంగా ఉండకూడదని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి పై రైతులకు అవగాహన కల్పించాలి

**- ఏవోలు, ఏఈవోలు పనితీరులో మార్పు రావాలి**
**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 1(జనంసాక్షి):** పంటల మార్పిడి పై జిల్లా రైతులకు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. ఏవోలు, ఏ ఈ వో లు తమ పనితీరు ను మెరుగు పరచుకోవాలని ఆమె సూచించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక పై జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంట మార్పిడి విధానాన్ని అమలు చేయడంలో ఏ ఈ వో పాత్ర ఎంతో కీలకం అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో పంటల మార్పు గురించి రైతులకు తెలియ జేయాలన్నారు. రైతులు సాగుకు సన్నద్ధం అయ్యే సమయంలోనే వారికి పంటల మార్పిడి గురించి చెబితే ప్రయోజనం ఉంటుందన్నారు. మట్టి నమూనాల సేకరణ,పార్మర్ రిజిస్ట్రీ, ఎరువులు, విత్తనాల పంపిణీ తదితర వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల అమలు కోసం అధికారులు తమ పని తీరును మెరుగు పరుచుకోవాలనీ, ఇక పై వారం, నెల రోజుల ఏ వో లు, ఏ ఈ వో ల హాజరు,పర్యటన లు, పని తీరు పై నివేదిక ఇవ్వాలని, పనితీరు మెరుగు పరచుకోకపోతే సంజాయిషీ కోరాలని జిల్లా వ్యవసాయ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఆయిల్ ఫామ్ అంటే కేవలం ఉద్యాన శాఖ కు సంబంధించినదే అని ఏ ఈ వో లు నిర్లక్ష్యం చేయకుండా ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డ్స్ అప్ డేశన్ ఎలా జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏ.డీ.ఏ నగేష్‌కుమార్, అన్ని మండలాల ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

# అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్లను వెంటనే నియమించాలి

**- పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.జనార్దన్ రెడ్డి**




**నారాయణపేట జూలై 1(జనంసాక్షి):** ఉపాధ్యాయులు కొరతను అధుగ మించేందుకు ప్రభుత్వం వెంటనే ఇన్స్ ట్రక్టర్లను నియమించాలని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు వై.జనార్దన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి కోరారు.బుధవాసన్ నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల అత్యవసర సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నారాయణపేట జిల్లాలోని విద్యార్థుల నిష్పత్తి ఉపాధ్యాయుల నిష్పత్తి పోలిస్తే చాలా మంది ఉపాధ్యాయుల కొరత ఉందని అందువలన ప్రభుత్వం వెంటనే అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించి పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించుటకు సహకరించాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు వలస వచ్చిన విద్యార్థులు తిరిగి ప్రైవేటు వైపు వెళ్లకుండా ఉండాలంటే వెంటనే అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ నియామకాలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రతి కార్యక్రమానికి యుడైస్ కొలమానం కావడం వల్ల పాఠశాలలు చేరిన ప్రతి విద్యార్థిని యుడైస్ లో వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సంఘ పక్షాన సూచించారు. మండలాల నుండి వచ్చిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనేక అంశాల మీద సుదీర్ఘంగా చర్చించారు. ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అదేవిధంగా మెరుగైన ఫిట్మెంట్తో పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వము ఆగస్టు నెలలో పదోన్నతులు బదిలీలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం రఘువీర్ ఎం జనార్దన్ సత్యనారాయణ రెడ్డి రమేష్ భాస్కర్ సూర్యప్రకాష్ గోపాల్ రెడ్డి బాబు బలరాం తిమ్మన్న అజయ్ శ్రీనివాస్ గౌడ్ భీమేష్ ప్రకాష్ అనంతయ్య గోవర్ధన్ నరసింహారెడ్డి లక్ష్మణ్ జైరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక రోగనిరోధక శక్తి టీకాలువల్లే సాధ్యం

**- టీకా నివారణ వ్యాధుల ముందస్తు నివారణపై సమావేశం**
**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్**



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 1 (జనంసాక్షి):** సామూహిక రోగనిరోధక శక్తి టీకాలువల్లే సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్ లో టీకా నివారణ వ్యాధుల ముందస్తు నివారణపై ప్రభుత్వ , ప్రైవేట్ చిన్న పిల్లల వైద్యులు, ఫిజీషియన్స్ , చర్మవ్యాధి నిపుణులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్, జిల్లా వ్యాధుల నిఘా అధికారి డా. నవ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. జయశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ టీకాల ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు ని వ్యక్తిగత రోగ నిరోధకశక్తితో పాటు జనాభాలో అధిక శాతం మందికి టీకాలు వేసినప్పుడుసామూహిక రోగనిరోధక శక్తి (హర్డ్ ఇమ్యూనిటీ) పెరగడం వల్ల వ్యాధులు నియంత్రణలో వుంటాయని, తెలిపారు. టీకాలు వేసుకోని వారికి వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం వున్నందున వారికి కూడా తక్షణమే టీకాలు వేయాలని తద్వారా వ్యాధులు ఒకరి నుండి ఒకరికి సోకకుండా నివారించవచ్చని, టీకాలు ప్రభావవంతంగా , సురక్షితంగా ఆరోగ్యాన్ని కాపాడుతాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చిన్న పిల్లలకు వెంటనే టీకాలు వేసి వారిని కాపాడాలని, వర్షాకాలంలో ముఖ్యంగా పిల్లలకు అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు వచ్చే అవకాశం వున్నందున క్రమం తప్పకుండా టీకాలు సిఫారస్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ తెలిపారు .ప్రోగ్రాం ఆఫీసర్ డా.నవ్య మాట్లాడుతూ ఎవరికైనా ఏ.ఎఫ్.పి (తీవ్రమైన ఫ్లాసిడ్ పక్షవాతం), ఎం.ఆర్ (మీజిల్స్, రుబెల్లా), డి.పి.టి (డిఫ్తీరియా, పెర్టుసిస్, నియోనాటల్ టెటానస్) మొదలైన వ్యాధులకు సంభందించిన లక్షణాలు కనిపించినచో టీకాల ద్వారా నివారించే కేసులను సకాలంలో చిన్న పిల్లల వైద్యులు, చర్మ వ్యాధి నిపుణులు, ఫిజీషియన్స్ గుర్తించి జిల్లా అధికారికి వెంటనే రిపోర్టులను పంపించాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.జయశ్రీ మాట్లాడుతూ జిల్లాలో ఏదైనా ఏ.ఈ.ఎఫ్.ఐ (అడ్వర్స్ ఈవెంట్ ఫాలోయింగ్ ఇమ్యునైజేషన్) సంభవించినట్లయితే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలని, అనుమానిత ఏ.ఎఫ్.పి (అక్యూట్ ఫ్లాసిడ్ పారాలసిస్) కేసులు, డి.పి.టి కేసులను గుర్తించినప్పుడు వెంటనే రిపోర్ట్ చేయాలని , ప్రతి సోమవారం హెచ్ 002 ఫారంను క్రమం తప్పకుండా పంపించాలని, ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడేమాలజిస్ట్ నవ్యప్రియ, ఐ.డి. ఎస్.పి. సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**రామాయంపేట, జూలై 1 (జనంసాక్షి):** రామాయంపేట మండల కేంద్రంలో రైతులు శీలం బాల్ రెడ్డి,శీలం వెంకట్ పొలంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.ఇట్టి కార్యక్రమాన్నీ ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ డిమాండ్ ఉన్న పంటలపై మొగ్గు చూపాలని, అందులో ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేనివిధంగా చట్టం ద్వారా ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఉందన్నారు.ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ , అంతర పంటల సాగు కొరకు రాయితీ సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడునన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాల పై రాయితీ సదుపాయం కల్పించబడునని,ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరముల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వచ్చుఅన్నారు.

ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ. 23,852 /-. ఈ లెక్కన సంవత్సరమునకు రూ. 2,38,520/- ఆదాయం వచ్చు అని ,ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరమునకు రూ. 2,00,000/- పొందవచ్చు. అని తెలిపారు.

రైతులు తమ ఆయిల్‌పామ్ ఉత్పత్తులను ఫ్యాక్టరీ వరకు రవాణా చేసుకొనుటకు అధిక ఛార్జీలు కేటాయించవలసి రావడం వలన



కంపనీ వారు రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రతి 15 ని.ఎ లకు ఒక కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కంపనీ వారు గెలలను కొనుగోలు చేసిన తరువాత నియమ నిబంధనల ప్రకారం 14 రోజులలోపు రైతు ఖతాకు డబ్బు జమ చేయబడుతుందనీ తెలిపారు.వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని,దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చని,ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా,ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని కోరారు.

# యూరియా అక్రమాల కేసులో ఫర్టిలైజర్స్ డీలర్ అరెస్ట్ రిమాండ్

**చేర్యాల, జూలై 01 (జనంసాక్షి) :** చేర్యాల డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ టి. రాధిక, చేర్యాల ఏఓ పులి భోగేశ్వర్ లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన యూరియా అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చేతిరెడ్డి సందీప్ రెడ్డిని చేర్యాల పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు జూన్ 9న చేర్యాల మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఎం/ఎస్ శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేయగా గోదాంలో యూరియా నిల్వలు భౌతికంగా కనిపించకపోవడంతో పాటు స్టాక్ రిజిస్టర్‌లో కూడా వాటి వివరాలు నమోదు చేయలేదని గుర్తించారు. దర్యాప్తులో భాగంగా డీలర్ సందీప్ రెడ్డి 6,429 యూరియా సంచులకు సంబంధించిన 22 ట్యాక్స్ ఇన్‌వాయిస్‌లను ఈ-పాస్ నుంచి ఫర్టిలైజర్ యూరియా యాప్‌లో అంగీకరించకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. దీంతో రైతులకు యూరియా బుకింగ్ యాప్‌లో కనిపించకుండా చేసి, రైతులకు విక్రయించినట్లు తప్పుడు బిల్లులు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ-పాస్ లో మాత్రమే లావాదేవీలు నమోదు చేసి, భౌతిక బిల్లులు, స్టాక్ రిజిస్టర్, ఇన్‌వాయిస్‌లను కేవలం కాగితాలపై రూపొందించినట్లు విచారణలో తేలినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం 45 కిలోల యూరియా సంచిపై రూ.2,200 నుంచి రూ.2,500 వరకు సబ్సిడీ అందిస్తుండగా, రైతులకు నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) రూ.266 మాత్రమే. ఈ అక్రమాల వల్ల నిజమైన రైతులకు సబ్సిడీ యూరియా అందకుండా పోవడంతో పాటు ఎరువుల పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడిందని వ్యవసాయ శాఖ పేర్కొంది. సుమారు రూ.17,10,144 విలువైన సబ్సిడీ యూరియాను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, 6,429 యూరియా సంచుల గల్లంతుపై హోల్‌సేల్ డీలర్లైన ఎం/ఎస్ శ్రీ ఆంజనేయ ఫర్టిలైజర్స్, సీడ్స్ ఢ పెస్టిసైడ్స్, ఎం/ఎస్ శ్రీ గణేష్ ట్రేడర్స్, అలాగే ఎం/ఎస్ శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ పాత్రపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఈ కేసులో నిందితుడైన చేతిరెడ్డి సందీప్ రెడ్డిని చేర్యాల సీఐ అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాలలో భద్రత పటిష్టం

**- సిద్దిపేట అడిషనల్ డీసీపీ (ఏ ఆర్) సుభాష్ చంద్రబోస్**

**కోహెడ, జూలై 01 (జనంసాక్షి):**

జిల్లాలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తోంది. బుధవారం మండలంలోని ఆరేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన “సురక్ష నేత్ర” కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను సిద్దిపేట అడిషనల్ డీసీపీ (ఎఆర్) సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. “సురక్ష నేత్ర” కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రజల సహకారంతో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని ఆయన అన్నారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని



డీసీపీ తెలిపారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 100 ఫోన్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణాలను నివారించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కోహెడ ఎస్ఐ పుల్ల అభిలాష్, ఆరేపల్లి గ్రామ సర్పంచ్ చిట్యాల బాబు రాజు, ఉప సర్పంచ్ గొండ నర్సింగరావు, విపిఓ మోహన్, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



**చేర్యాల, జూలై 01 (జనంసాక్షి):** సిద్ధిపేట జిల్లా చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన రైతు కాశెట్టి వెంకటయ్య తన వారసత్వ భూ వివాదంలో పోలీసు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తన కుటుంబ వారసత్వ భూమి వివాదంలో చేర్యాల సీఐ రమేష్ నాయక్, కానిస్టేబుల్ కిరణ్‌లు జోక్యం చేసుకుని ఫోన్‌లో పరుష పదజాలంతో దూషిస్తూ, తాను చెప్పినట్లు వినకపోతే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాను, తన భార్య కాశెట్టి రజిత కలిసి మరుసటి రోజు చేర్యాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, సీఐ తన ఛాంబర్‌లోకి పిలిపించి తమ ఇద్దరినీ అవమానకరంగా దూషించడంతో పాటు వారసత్వ భూమిలోకి వెళ్లొద్దని హెచ్చరించారని వెంకటయ్య ఆరోపించారు. అంతేకాకుండా ప్రత్యర్థులతో కుమ్మక్కై తనపై తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన మానవ హక్కుల న్యాయవాది పత్తి నరేష్ సహకారంతో వెంకటయ్య కుమారుడు కాశెట్టి రాకేష్ తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

**గమనిక:** ఈ కథనం ఫిర్యాదుదారులు చేసిన ఆరోపణల ఆధారంగా రూపొందించబడింది. ఈ ఆరోపణలపై చేర్యాల సీఐ లేదా పోలీసు శాఖ స్పందన అందాల్సి ఉంది.

# చేర్యాల ఏఓ డిప్యూటేషన్ రద్దు చేయాలని అదనపు కలెక్టర్‌కు వినతి



**సిద్దిపేట బ్యూరో/చేర్యాల (జనంసాక్షి):** చేర్యాల మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పులి భోగేశ్వర స్వామిపై విధించిన డిప్యూటేషన్‌ను తక్షణమే రద్దు చేసి, ఆయనను తిరిగి చేర్యాల మండలంలోనే కొనసాగించాలని కోరుతూ బుధవారం చేర్యాల మండల రైతులు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో రైతులు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఏఓ పులి భోగేశ్వర స్వామి రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఎరువుల పంపిణీకి సంబంధించిన అవకతవకలపై ఆయన తన విధి నిర్వహణలో భాగంగా విచారణ చేపట్టి కేసు నమోదు చేయించారని పేర్కొన్నారు. అయితే ఆ చర్యల నేపథ్యంలోనే ఆయనపై కక్ష సాధింపు ధోరణితో డిప్యూటేషన్‌పై సిద్దిపేట మట్టిపరీక్ష కేంద్రానికి బదిలీ చేశారని రైతులు ఆరోపించారు. చేర్యాలలో నిజాయితీగా పనిచేస్తున్న అధికారిని అన్యాయంగా పంపించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పులి భోగేశ్వర స్వామి డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి, చేర్యాల మండల వ్యవసాయ అధికారిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# అర్హులందరికీ నూతన ఇండ్లను మంజూరు చేస్తాం

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య**

**- అల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం**



**రాయికోడు, జులై 1, (జనంసాక్షి):** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో తిప్పన్న దంపతుల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి స్థానిక సర్పంచ్ చరణ్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అర్హులైన పేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది అన్నారు.మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రాయికోడు మండలంలో కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి అన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు. అల్లాపూర్ గ్రామంలో 14 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం అతిథులందరినీ లబ్ధిదారు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్,మాజీ సర్పంచ్ సతీష్, మాజీ ఎంపీటీసీ మహంకాళి,మాజీ యాత్ అధ్యక్షులు ప్రభాకర్, యువత అధ్యక్షులు విదర్శన్ రెడ్డి, నాయకులు జి విటల్, సంఘయ్య స్వామి అఫ్జల్ పటేల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ఘనంగా నారాయణకు పదవి విరమణ వీడ్కోలు సన్మానం



నాగర్ కర్నూల్, జూలై 1 (జనంసాక్షి): నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో గత నాలుగు సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న కే.నారాయణకు పదవి విరమణ సందర్భంగా సూపరింటెంట్ డాక్టర్ టి.ఉషారాణి పూలమాలలు, శాలువాలలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో నారాయణ సేవలు సంతృప్తికరమని అన్నారు. గతంలో రెవెన్యూ శాఖలో గద్వాల తిమ్మాజీపేటలో పనిచేసినట్లు తెలిపారు. అనంతరం పదవి విరమణ ధ్రువీకరణ పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు సిజే వసంత్ కుమార్, మోహన్ బాబు, రవి, గాలిబ్ అలీ, ఆయన కుటుంబ సభ్యులు జంగమ్మ, గణేష్, గౌరీశ్రీ, చంద్రకాంత్, శిరీష, సహ ఉద్యోగులు, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర క్షేత్రాన్ని దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్



అచ్చంపేట, జూలై 1 (జనంసాక్షి): మండల పరిధిలోని శ్రీశైల ఉత్తర ద్వారం శ్రీ ఉమామహే శ్వరస్వామి ఆలయాన్ని దర్శించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీమతి రాణి కుముదుని IAS.(Retired). ఆలయం అర్చకులతో పూర్ణకుంభం స్వాగతం ఆహ్వానించడం జరిగినది. గణపతి పూజ, ఉమాదేవి పూజ కుంకు మార్చన మరియు అభిషేకం పూజలు నిర్వహించన అనంతరం ఆలయ శేషవస్త్రంతో సన్మానించి వేదఆశీర్వాదం. ఆలయ చరిత్రను విశిష్టతను అడిగి తెలుసుకున్నారు తదానంతరము ఆలయ పరిసర ప్రాంతంలను పాప నాశనం, ప్రకృతి రమణీయతను జల ధారాలను చూసి ఆలయం చాలా బాగుందని అన్నారు అలాగే నిత్య అన్నదానం నందు జరుగుచున్న అన్నదాన కార్యక్రమశీ చాలా బాగుందని కొనియాడారు. ఇట్టి కార్యక్రమం ఆలయ పాలక మండల చైర్మన్ బీరం మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేయగా అచ్చంపేట ఆర్డీవో ఎమ్మార్వో డి.ఎస్.పి సిఐ కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది మరియు ఆలయ అధికారులుఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మల్దకల్, జూలై 1(జనంసాక్షి): మండల పరిధిలోని అమరవాయి గ్రామం మూలమలుపు వద్దబుధవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన కురువరవి(32)అనే వ్యక్తి మహబూబ్నగర్ నుండి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గద్వాల్ నుండి అంతంపల్లికి ట్రాక్టర్ వెళుతుండగా అమరవాయి గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.పోస్టుమార్టం నిమిత్తం మృతిని శవాన్నిగద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ క్షేత్రస్థాయిలో పకడ్బందీగాఅమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో చీఫ్, జూలై 1 (జనంసాక్షి): సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026( సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026) లో భాగంగా బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యతగా మెలిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం దిశగా భాగస్వామ్యం కావాలన్నారు ఇంటి వద్దనే ఘన వ్యర్థాలు నాలుగు విభాగాలుగా వేరుచేసి గ్రామపంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని, సూచించారు. నాలుగు రకాల చెత్త తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త ప్రత్యేక జాగ్రత్త చెత్త గా వేరుచేసి ఇవ్వాలని ,తడి చెత్తకు ఆకుపచ్చ రంగు డస్ట్ బిన్, పొడిచేతకు బ్లూ కలర్ డస్ట్ బిన్, సానిటరీ చెత్తకు రెడ్ కలర్ డస్ట్ బిన్ మరియు ప్రత్యేక జాగ్రత్త చెత్తకు వాడా బ్లాక్ కలర్ డస్ట్ బిన్ లను వాడాలని తెలియజేయడం జరిగిందన్నారు.

జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు మరియు అన్ని గ్రామపంచాయతీలో, అన్ని గ్రామపంచాయతీ, మండల, డివిజన్ జిల్లా ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల్లో, షాపుల్లో , పరిశ్రమల్లో దాబాల్లో హోటల్స్ లో రైల్వేస్టేషన్లో, బస్టాండ్లలో హాస్పటల్లో తప్పనిసరిగా చెత్తను నాలుగు రకాలుగా వేరుచేసి ఇవ్వాలని అధికారులకు మరియు ప్రైవేట్ యాజ మాన్యాలకు, ప్రజలకు, మహిళా సంఘాలకు సూచించారు. తడిచెత్తలో భాగంగా మిగిలిన ఆహారము, వంటింటి చెత్త, కూరగాయలు, పండ్ల తొక్కలు, వాడిన పూలు, మాంసము చెత్త మొదలగునవి ఉంటాయని ,వీటితో కంపోస్ట్ ఎరువు తయారు అవుతుందని తెలిపారు. పొడి చెత్తలో భాగంగా కాగితము ,అట్టపెట్టెలు ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులు, సీసాలు, రబ్బరు మొదలైనవి రీసైక్లింగ్ చేయగలిగినవి ఉంటాయని తెలిపారు. సానిటరీ వేస్ట్ లో భాగంగా డైపర్లు, సానిటరీ ప్యాడ్స్, నాప్కిన్లు, కండోమ్స్ మొదలైనవి ఉంటాయి ఉంటాయని, వీటిని సపరేటుగా తీసుకొని ఇన్సులిరేటర్స్ యంత్రంలో పెట్టి డిస్పోజ్ చేస్తారని తెలిపారు. ప్రత్యేక జాగ్రత్త చెత్త అనగా పెయింటింగ్ డబ్బాలు, బల్బులు, పురుగుమందుల డబ్బాలు, టాబ్లెట్స్ గడువు ముగిసిన మందులు, మెడికల్ వ్యర్థాలు మొదలనే ఉంటాయి, ఎలక్ట్రానిక్ వేస్ట్ ఉంటాయని వీటిని గుర్తింపు కలిగిన రీసైక్లింగ్ డీలర్లకు పంపడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నాలుగు రకాల చెత్తను తీసుకొనుటకు ట్రాక్టర్లో నాలుగు రకాల పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా సర్పంచులు, వార్డు మెంబర్లు లీడ్ ఫెసిలిటేటర్స్ గా గ్రామంలో ప్రతి ఒక్కరికి దీనిపైన ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. బల్క్ వేస్ట్ జనరేటర్స్ తప్పకుండా ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి .వి శ్రీనివాసరావు ,అడిషనల్ కలెక్టర్ నగేష్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ సిఈఓ ఎల్లయ్య ,డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిఆర్వో అంబదాస్ రాజేశ్వర్ తాసిల్దారులు, డిఎస్పీలు, సిఐలు మరియు, ఎస్సైలు అధికారులు యొక్క అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం



కొత్తపల్లి జూలై 1 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా సర్కారు జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. బుధవారం రోజు కొత్తపల్లి (భూనీడ్ ) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించడం జరిగింది. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి అధ్యాపకులు అంజని బాయి, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, నాగరాజు, వెంకటేష్, భాస్కర్, తిరుపతయ్య, సంజీవ్, మల్లేష్, హేమలత, రాణి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యా వాలంటీర్లను నియమించాలి

- మండల విద్యాధికారికి ఏబీవీపీ వినతి



మక్తల్, జూలై 01 (జనంసాక్షి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల విద్యా అధికారి అమీరుద్దీన్ కి ప్రభుత్వ పాఠశాలలో విద్యా వాలంటీర్లను నియమించాలని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్ మాట్లాడుతూ మక్తల్ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు విద్యా వాలంటీర్ పోస్టులను తక్షణమే నియమించాలని కోరారు. మక్తల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎం శ్రీ (బాలుర), జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాలలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్, అదనపు తరగతి గదులను, మూత్రశాలలను, ప్రహరీ గోడలను నిర్మించి విద్యార్థులకు మంచి మౌలిక వసతులను కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఆనంద్, కార్తీక్, శివ, అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సమాచారం లేకుండానే పనులు ప్రారంభం

- అధికారులపై మాజీ మంత్రి వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఆగ్రహం



కొల్చారం, జూలై 1(జనంసాక్షి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు తాను సహకరిస్తున్న పలు శంకుస్థాపనలకు కనీసం సమాచారం ఇవ్వరా? అధికారులపై మాజీ మంత్రి నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా కాదా అని ప్రశ్నించారు. మండల కేంద్రమైన కొల్చారంలో తపాల శాఖ ప్రారంభోత్సవానికి అధికారిక సమాచారం ఇవ్వరా అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజూరి కోసం సంబంధిత అధికారులకు మండల కేంద్రమైన కొల్చారంలో తదితర గ్రామాల సౌకర్యార్థం కోసమని 2024లో ప్రతిపాదనలు పంపిన తనకు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని అధికారులను నిలదీశారు. పద్ధతి మార్చుకోవాలని హెడ్ పోస్ట్ ఆఫీస్ సూపరిండెంట్ కు సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పైతర సర్పంచ్ రవితేజ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, కరెంట్ రాజా గౌడ్, ఉప సర్పంచ్ కొరంపల్లి రాణి గోపి, దుర్గ ప్రసాద్ గౌడ్ , ఎల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హోతి(కె) డబుల్ బెడ్రూం కాలనీలో సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

జహీరాబాద్, జూలై 1(జనంసాక్షి): జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి (కె) డబుల్ బెడ్రూం కాలనీలో నివసిస్తున్న ప్రజలు తాగునీరు, విద్యుత్, వీధి దీపాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు.బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ, కాలనీలో బోర్లలో నీరు ఉన్నప్పటికీ మోటార్లు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతి, ముత్తాబీర్, బక్కన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 94 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ**

**- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**



**జడ్చర్ల, జూలై 1 (జనంసాక్షి):** జిల్లా వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 94 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని రెవెన్యూ అదనపు కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ వెల్లడించారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని, ఎన్నికల సిబ్బందికి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటరు జాబితాను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియ ఉద్దేశ్యం, ఓటరు నమోదు, వివరాల మార్పులు, చేర్పులు మరియు తొలగింపుల పురోగతిని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం జాబితాను సిద్ధం చేస్తామని, ఈ ప్రక్రియలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. మిగిలిన ఓటర్లను త్వరితగతిన గుర్తించి, వారికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు మరియు బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, సేకరించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

ఓటర్ల వివరాలను నమోదు చేయడంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్https://www.eci.gov.in, https://www.eci.gov.in ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ గిరీష్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ అలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ, ఎన్నికల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్ననూరులో అక్రమ పేలుడు పదార్థాల కలకలం

**- 83 జిలెటిన్ స్టిక్స్, 20 డెటోనేటర్ల స్వాధీనం.. నిందితుడు అరెస్ట్**



**గోపాలపేట, జూలై 1 (జనంసాక్షి):** గోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్ననూరు గ్రామ శివారులో అక్రమంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తూ రాళ్లు పేల్చుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి లైసెన్స్, ప్రభుత్వ అనుమతులు లేకుండానే వ్యవసాయ భూమిని చదును చేసే పేరుతో పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు విచారణలో తేలింది. అరెస్టైన నిందితుడు మండ్ల కురుమూర్తి (36)గా పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుంచి 83 జిలెటిన్ స్టిక్స్, 20 డెటోనేటర్లు, 100 మీటర్ల కార్డెక్స్ వైరుతో పాటు పేలుడు పదార్థాల తరలింపునకు వినియోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోపాలపేట ఎస్ఐ డి. శశిధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలను అనుమతులు లేకుండా నిల్వ చేయడం, వినియోగించడం ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే నేరమని, ఇలాంటి కార్యకలాపాలపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కుసుమూర్తిలో పీఠాధిపతి సత్యాత్మ తీర్థులు స్వామి ప్రత్యేక పూజలు



**కృష్ణ జూలై 1 (జనంసాక్షి):** ఉత్తరాది మఠ పీఠాధిపతులు సత్యాత్మ తీర్థులు స్వామి బుధవారం కృష్ణ మండలం కుసుమూర్తి గ్రామం ఉత్తరాది మఠ మూల బృందావనంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి ప్రవచనాలు చేశారు. గురువారం ఉమ్మడి మాగనూరు మండలం కొల్పూరు గ్రామంలో సత్యపూర్ణ తీర్థుల 300 సంవత్సరాల ఆరాధన ఉత్సవాల్లో పాల్గొనేందుకు స్వామీజీ మంత్రాలయ నుండి ఇక్కడికి చేరుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వదించారు రైతులకు పంటలు బాగా పండాలని అన్నారు.

# కొనసాగుతున్న శ్రీ అంజనేయ స్వామి ఆలయ ప్రారంభ వేడుకలు

**- భక్తిశ్రద్ధలతో ఘనంగా యజ్ఞం కార్యక్రమం**



**ఉర్కొండ జూలై 01, (జనంసాక్షి):** ఊరుకొండ మండలం ఇప్పపహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం రోజు ఆలయంలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖర శర్మ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజ్ఞం, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సునీత రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామస్తుల సహకారంతో అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ ఆలయాన్ని నిర్మించుకున్నాం. శ్రీ అంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు, గ్రామ పెద్దలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మంగళవారం, శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగ్యరాణి శివ,, ఓబీసీ మండల అధ్యక్షులు కానుగుల బుచ్చయ్య, సుందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలస్వామి, శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలచందర్ స్వామినీ ఘనంగాన సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలి



**జడ్చర్ల, జూలై 1 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన వి.బి.జి.రామ్ జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలే జగన్ డిమాండ్ చేశారు. బుధవారం జడ్చర్ల మండలంలో నిర్వహించిన నిరసనలో భాగంగా ఆయన ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలే జగన్ మాట్లాడుతూ కొత్త చట్టం వల్ల ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, నిధుల కోత వల్ల పనులు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం 95 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి 125 రోజుల పని కల్పించడం అసాధ్యమని, ఇది ఉపాధి కూలీల పనుల్లో కోత విధించే కుట్ర అని విమర్శించారు. లేబర్ కోడ్లు, జాతీయ విత్తన చట్టాలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండలంలోని కిష్టంపల్లి, బరుగుపల్లి, ఆలూరు, నసురుల్లాబాద్, లింగంపేట్ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు పి.సాయిలు, యాదయ్య, వి.శ్యాంసుందర్, కరుణాకర్, ఇస్తారయ్య, నాగమ్మ, సిఐటియు కార్యకర్తలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే ధినోత్సవం



**శివ్వంపేట జూలై 1 (జనంసాక్షి):** డాక్టర్స్ డే ధినోత్సవాన్ని పురస్కరించుకొని శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో బుధవారం ఘనంగా వైద్యుల రోజును జరుప కున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా గ్రామానికి చెందిన సీనియర్ వైద్యులు వి.సుబ్రహ్మణ్యంను నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు శాలువాలతో ఘనంగా సత్కారించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం దొంతి గ్రామంలో డాక్టర్ వైద్యవిద్యను అభ్యసించి 37 సంవత్సరాలుగా పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని గ్రామస్థులు గుర్తు చేశారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం యొక్క తల్లిదండ్రులు స్మారకార్థం లింగోజీ, గంగాబాయ్ దంపతుల ఆశయ సాధనకు డాక్టర్ సుబ్రహ్మణ్యం అధికారులు, అలాగే ప్రజా ప్రతినిధుల యొక్క సేవలను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా 570 మందిని సత్కరించడం జరిగిందన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా హెల్త్ క్యాంప్స్, టీచర్స్ డే, మహిళా ధినోత్సవం, డాక్టర్స్ డే, ఇంజనీర్స్ డే లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి రాహుల్, వంజరి నరేష్, గోపి, మురళి, అక్బర్, శ్రీనివాస్, ఆనంద్, కృష్ణ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# షాపులలో యూరియా విక్రయించాలి

**- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



**కొల్చారం, జూలై 1 (జనంసాక్షి):** యాప్ ద్వారా యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి మండిపడ్డారు. కొల్చారం మండలం లోని వసురంతాండాలో ఆమె మీడియాతో మాట్లాడుతూ షాపులలో యూరియా దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారని, గతంలో మాదిరిగా ఇప్పుడు కూడా షాపుల ద్వారా యూరియా విక్రయించాలి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పైతర గ్రామ సర్పంచ్ రవితేజ రెడ్డి,సర్పంచులు వినోద్ నాయక్, స్వామి, మోహన్, గీత రమేష్, మాజీ సర్పంచ్ కరెంట్ రాజా గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, గౌరీ శంకర్, ఇంద్రసేనారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో ఉరి పెట్టుకొని యువకుని మృతి



**రాయికోడు, జూలై 1, (జనంసాక్షి):** అనుమానాస్పద స్థితిలో ఇంట్లో దూలంకు ఉరి పెట్టుకొని ఒక యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చర్ల రాయి పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రైకోడ్ ఎస్సై చైతన్య కిరణ్ కథనం ప్రకారం రాయిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి దుర్గయ్య కుమారుడు ఉప్పరి రజిత్ వయస్సు 20 సంవత్సరాలు తన ఇంట్లో ఎవరు లేరు సమయంలో దూలానికి ఉరివేసుకొని ఉన్నట్లు కనిపించిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చావుపై అనుమానం ఉందని దరఖాస్తు ఇచ్చారన్నారు. జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, రూరల్ సిఐ జక్కుల హనుమంతు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. యువకుడి మృతి పై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వగా విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషిచేయాలి

**జహీరాబాద్, జూలై 1(జనంసాక్షి):** సహకార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు జరా సంఘం మండలం ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రైతులు, సభ్యుల కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా సహకార అధికారి ఆర్. కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సభ్యుల భాగస్వామ్యంతోనే సహకార సంఘాలు మరింత బలోపేతం అవుతాయని, రైతు సంక్షేమమే సహకార వ్యవస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు.సహకార శాఖ అధికారులు రైతులకు సభ్యత్వం, రుణాల సక్రమ వినియోగం, పొదుపు అలవాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, సహకార సంఘాల అభివృద్ధికి ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎం. శివకుమార్, వైస్ చైర్మన్ కాంతమ్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. వినయ్ కుమార్, పోమాసింగ్, సహకార శాఖ అధికారులు కిరణ్మయి, శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, బ్రాంచ్ మేనేజర్ రాజు, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, సొసైటీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేవిధంగా చూడాలి

**- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య**

**- ఎస్ఐఆర్ పై రాయికోడులో బిఎల్ఎలకు అవగాహన**



**రాయికోడు, జులై 1, (జనంసాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును నమోదు అయ్యే విధంగా బిఎల్ఎ లు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పిలుపునిచ్చారు.రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో బుధవారం రాయికోడ్ లోని ఎస్ ఎస్ పాటిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఎస్ ఐ ఆర్ పై కాంగ్రెస్ పార్టీ నియమించిన బి యల్ ఏ ల అవగాహన సదస్సుకు డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, ఇతర నాయకులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అన్ని గ్రామాల బిఎల్ఎలు అర్హత గల వాళ్లందరి ఓటు నమోదు అయేలా చూడాలని పిలుపునిచ్చారు.డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధాన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, తదితరులు పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మండల కన్వీనర్ గా కేదార్నాథ్ పాటిల్ తోపాటు రూట్ ఆఫీసర్లుగా మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, మాజీ ఎంపిటిసి మహంకాళి, అల్లాపూర్ సర్పంచ్ చరణ్ కుమార్ లను నియమించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజు పాటిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి,సీనియర్ నాయకులు సుభాష్ పాటిల్, జ్ఞానేశ్వర్, మహమ్మద్ సుల్తాన్, సర్పంచులు రాజశేఖర్ గౌడ్, పిఎస్ఎ చైర్మన్ నాగిశెట్టి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులను వేధించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

**- డీఎం బాలకృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలి**



**రామాయంపేట, జులై 1 (జనంసాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని కాట్రాల్, దంతపల్లి, పర్వతాపూర్, కిషన్ తాండా, బాపనాయక్ తాండా, లక్ష్మాపూర్ తదితర గ్రామాల రైతులు ఈ ఏడాది సుమారు 30 వేల క్వింటాళ్ల జొన్న పంట సాగు చేసి పండించారు. గతంలో రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల సమస్యను గుర్తించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారి చొరవతో రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయబడింది. కొనుగోలు కేంద్రంలో ప్రారంభంలో కొంత మేర జొన్నలను కొనుగోలు చేసినప్పటికీ, అనంతరం మార్క్‌ఫెడ్ డీఎం బాలకృష్ణ నాణ్యత పేరుతో రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. లారీలను వెనక్కి పంపించడం, మళ్లీ శుభ్రం చేసి తీసుకురావాలని చెప్పడం, తిరిగి తీసుకొచ్చిన తర్వాత కూడా కొనుగోలు చేయకుండా తిరస్కరించడం వల్ల రైతులపై భారీ ఆర్థిక భారం పడింది. లారీ అద్దెల రూపంలో రైతులు లక్షల రూపాయల నష్టాన్ని చవిచూశారు.

ఈ విషయమై ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు పలు మార్లు డీఎంతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కూడా పలుమార్లు వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను కూడా డీఎం పట్టించుకోకుండా రైతులను వేధించడం అత్యంత దురదృష్టకరం.

ప్రారంభం నుంచే భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు రైతుల పక్షాన నిలబడి సమస్యను కలెక్టర్, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు. గత 60 రోజులు గా బీజేపీ రైతుల తరఫున ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహిస్తూ రైతులకు అండగా నిలిచింది.

డీఎం బాలకృష్ణ వ్యవహారశైలి చూస్తుంటే మాజీ మంత్రి హరీష్ రావు సూచనల మేరకు ఈ సమస్యను కావాలనే జటిలం చేసి రాజకీయ లబ్ధి చేకూర్చే ప్రయత్నం జరిగినట్లు కనిపిస్తోంది. రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం అత్యంత సిగ్గుచేటు. గత పదేళ్లలో జొన్నల కొనుగోలు కేంద్రం కోసం ఎలాంటి చర్యలు తీసుకోని వారు, ఇప్పుడు రైతుల పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించడం సమంజసం కాదు. ఈ విషయాన్ని మెదక్ ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భారతీయ జనతా పార్టీ డిమాండ్లు రామాయంపేటలో నిల్వ ఉన్న మిగిలిన ఐదు లారీల జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలి. రైతులకు కలిగిన రవాణా, ఇతర ఆర్థిక నష్టాలకు తగిన నష్టపరిహారం అందించాలి. మార్క్‌ఫెడ్ డీఎం బాలకృష్ణపై వెంటనే శాఖాపరమైన విచారణ చేపట్టాలి. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని డీఎం బాలకృష్ణను బాధ్యతల నుంచి తొలగించాలి. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఎం బాలకృష్ణను వెంటనే సస్పెండ్ చేసి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది. రైతులకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రామాయంపేట మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, దంతపల్లి సర్పంచ్ బాలరాజు, నందిగామ సర్పంచ్ ఆకుల రమేష్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు చింతల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి సోమేశ్వర్ రావు



**కోహీర్ జూలై 1 (జనంసాక్షి):** జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి సోమేశ్వర్ రావు బుధవారం కోహీర్ మండలంలో పర్యటించి పలు పాఠశాలలను తనిఖీ చేశారు. మండలంలోని దిగ్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శించి భోజన సరుకుల నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజనం నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్, ఎం పి ఓ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే చేర్యాల డాక్టర్లకు పంచతంత్ర విద్యార్థుల సన్మానం



**చేర్యాల, జూలై 01 (జనంసాక్షి) :** డాక్టర్స్ డే సందర్భంగా పట్టణంలోని పంచతంత్ర పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలువురి డాక్టర్లకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మణిందర్ వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ దగ్గరకు వచ్చి శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నారు, పెద్దలు డాక్టర్స్ డే సందర్భంగా వారిని సన్మానించడం సంతోషదాయకమని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, వర్ధిని, చంద్రిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## హద్దులు దాటి వైద్యం చేయరాదు

**- చేర్యాల డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు రామగల్ల పరమేశ్వర్**



**చేర్యాల, జూలై 01 (జనంసాక్షి) :** చేర్యాల ప్రాంత పరిధిలో,ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ డాక్టర్స్, ప్రైవేట్ సెక్టార్లో సేవలు అందిస్తున్న క్వాలిఫైడ్ డాక్టర్స్ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆర్ఎంపి వైద్యుల కు, సిడిఎ (చేర్యాల డాక్టర్ అసోసియేషన్ అన్) తరుపున డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభసందర్భంగా హద్దులు దాటి పనిచేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లకు లకు విజ్ఞప్తిగా ఏళ్ళ తరబడి ఎంతో వ్యయప్రయాసలకు, కష్టాలకు ఓర్చి, వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కన పెట్టీ పట్టాలు(డిగ్రీలు) సంపాదించిన డాక్టర్స్ ను, సంతలో సరుకుగా మార్చకండి.క్వాలిఫైడ్ డాక్టర్స్ ను నెలవారి జీతము తో చేర్యాల పట్టణములో హాస్పిటల్స్ నిర్వహించడం ఎంతవరకు భావ్యం కాదు. దయచేసి చేర్యాల పట్టణములో వైద్యాన్ని, వైద్యవృతిని, వ్యాపార కేంద్రంగా మార్చకండి. అందులో నాకు కూడా వీసమెత్తు వెసులుబాటు లేదు. కొంత మంది ఆర్ఎంపీ డాక్టర్ లు హాస్పిటల్స్ నిర్వహించడం పునః పరిశీలన చేసుకోవాలని ఈ డాక్టర్స్ డే సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే చేర్యాల ప్రాంతము సామాజిక చైతన్యానికి, ఉద్యమాలకు,పోరాటాలకు నిలయం. చేర్యాల ప్రాంతాన్ని మరే ఇతర ప్రాంతాలు అయినా సిద్దిపేట,హుస్నాబాద్, గజ్వేల్ లాంటి ప్రాంతాలలో వైద్య పరంగా జరుగుతున్న పరిణామాలను పరిగణంలోకి తీసుకొని, మితిమీరిన ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేసి దుస్సాహసానికి ఒడిగట్టి ప్రజల పై వైద్య సేవ పేరుతో ఆర్థిక భారం కలిగించకండి. చేతిలో ఓ సర్టిఫికెట్ పట్టుకొని డాక్టర్స్ కు మించి, ఈ ప్రాంత ప్రజల అవసరాలకు మించి ఇబ్బడి ముబ్బడిగా డయాగ్నస్టిక్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరిణా మము ప్రజలకు సంబంధించి ఏ మాత్రము మంచిది కాదు. ఈ ప్రాంతములోని రాజకీయ పార్టీలకు నా విజ్ఞప్తిగా ప్రజా కోణంలో, సామాజిక కోణంలో, ప్రాంతీయ కోణంలో స్వీకరించగలరనీ తెలిపారు.

## డాక్టర్స్ డే సందర్భంగా డా. ఎస్.మధుకర్‌కు ఘన సన్మానం



**గుమ్మడిదల, జూలై 1 (జనంసాక్షి):** ప్రపంచ మానవాళి ఆరోగ్యంగా జీవించాలంటే వివిధ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపే వైద్యులు భగవంతునితో సమానమని పెద్దలు చెబుతారు. వైద్యాన్ని కేవలం వృత్తిగా కాకుండా ప్రాణాలను కాపాడే మహోన్నత సేవగా భావించి ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యులను గౌరవించే రోజే డాక్టర్స్ డే. ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రముఖ వైద్యులు డా. ఎస్. మధుకర్ గారిని ఘనంగా సన్మానించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ ఆకుల మాధవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, హుస్సేన్, మండలంలోని ఆర్ఎంపీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ అభినందనలు తెలిపారు.

## మెదక్‌లో బెల్లం చాయ్ రుచిచూసిన మాజీ ఎమ్మెల్యే



**మెదక్ మున్సిపాలిటీ, జులై 1 (జనంసాక్షి):** మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు మెదక్ పట్టణంలో కార్యకర్తలతో కలిసి బెల్లం చాయ్‌ను ఆస్వాదించారు. మెదక్ పట్టణ ములోని చామన్ వద్ద వున్నా బెల్లం చాయ్ ఈ సందర్భంగా ఆయన మెదక్ ప్రజల ఆతిథ్యం, ఆప్యాయత, ప్రేమాభిమానాలపై ప్రశంసలు కురిపించారు.మెదక్ పట్టణ ప్రజలు ఎంతో మంచి మనసు కలిగిన వారు వారి ప్రేమ, ఆత్మీయత ఎప్పటికీమరువలేనిది. తాగిన బెల్లం చాయ్ కూడా అదే మధురానుభూతిని కలిగించింది. ఈ చాయ్‌లోని తీపిలాగే మెదక్ ప్రజల ప్రేమ కూడా ఎంతో మధురంగా ఉంటుంది" అని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మెదక్ పట్టణ ములోని చామన్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ అవారి శేఖర్ హోటల్ వద్ద కార్యకర్తలతో కలిసి సరదాగా ముచ్చటిస్తూ బెల్లం చాయ్ తాగిన ఆయన, స్థానికులతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తడి పొడిచెత్తపై మహిళలకు అవగాహన



**చిన్నశంకరంపేట, జులై 1(జనంసాక్షి):** చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకుగ్రామంలో తడి చెత్త పొడి చెత్త ప్రత్యేక చెత్త శానిటరీ చెత్తపై సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతిరోజు నాలుగు రకాల చెత్త వేరువేరుగా వేయాలని గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సెక్రెటరీ సంతోష్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు, పాలకవర్గం సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రేగోడ్ మంజీరా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**- అధ్యక్షుడిగా పీర్యా నాయక్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ రావు నియామకం**





**రేగోడ్**

రేగోడ్ మండలం లయన్స్ క్లబ్ 2026 – 2027 సంబంధించిన రేగోడ్ మంజీరా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నారాయణయ ఖేడ్ లయన్స్ క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ దిగంబర్ రావు,రేగోడ్ మంజీరా లయన్స్ క్లబ్ తొలి అధ్యక్షులు మున్నూరి కిషన్ ఆధ్వర్యంలో రేగోడ్ మంజీరా లయన్స్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని,అధ్యక్షులుగా పీర్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా శంరాయినోళ్ళ సంతోష్ రావు, కోశాధికారి శివరాజయ్య స్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జగరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తపస్వి రామ్ రావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్, జులై 1( జనంసాక్షి):** తపస్వి రామ్ రావ్ మహారాజ్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.బుధవారం హవేలీఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండా గేట్ వద్ద శ్రీశ్రీశ్రీ తపస్వి రామ్ రావ్ మహారాజ్, ప్రేమ్ సింగ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మా దేవేందర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తపస్వి రామ్ రావ్ మహారాజు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. సేవాభావం, మానవతా విలువలు, ఆధ్యాత్మికతతో కూడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలు, బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టడంతో పాటు భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని అన్నారు.అనంతరం గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. ఆమెతో కలిసి గిరిజన మహిళలు, యువత ఉత్సాహంగా నృత్యం చేయగా, భక్తులు, స్థానికులు హర్షధ్వానాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ జుబేర్,నాయకులు రంజా నాయక్, పూల్ సింగ్, సూర్యం, శ్రీను నాయక్, మోహన్ నాయక్ రంజిత్ తరుణ్, రామచంద్ర రెడ్డి, సాప. సాయిలు, శ్రీహరి, నరేందర్ రెడ్డి,రాజు, యామిరెడ్డి, నరేందర్ నాయక్, గడ్డమీది కృష్ణ గౌడ్, మాయ. మల్లేశం, శ్రీనివాస్,శ్రీకాంత్ రెడ్డి సాయి,గ్రామ పెద్దలు, భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**చేర్యాల, జులై 01 (జనంసాక్షి):** చేర్యాల మున్సిపాలిటీలోని 12 వ వార్డులోనీ మాచర్ల అందాలు ఆంజనేయులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా హాజరైన అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పథకం ద్వారా నిరుపేద కుటుంబానికి అండగా ఉంటూ ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలని ప్రజా ప్రభుత్వం భావిస్తోంది. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సహకారంతో అర్హులైన పేదవారికి చేర్యాల పట్టణ కేంద్రంలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొతిగంటి ప్రసాద్,చేర్యాల మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండి.ఖాజా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటం మల్లేశం, బుట్టి యాదగిరి, పచ్చిమడ్ల వెంకటయ్య గౌడ్,నీలం సన్నీ,శనిగారి బిక్షపతి,తుమ్మలపల్లి సంతోష్,వార్డు ఆఫీసరు అనిల్,శరత్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి చట్టాన్ని బలహీనపరిచే వి.బి.జి రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి : సీఐటీయూ

**- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అతిమెల మాణిక్**



**కొండాపూర్, జులై 1 (జనంసాక్షి):** గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే వి.బి.జి--రామ్ జీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ, 2005లో కేంద్ర యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చిందని, అప్పటి నుంచి గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. పనిస్థలంలో ప్రమాదవశాత్తు మరణించిన కూలీల కుటుంబాలకు రూ.10 లక్షల బీమా, అవసరమైన మెడికల్ కిట్లు, పనిముట్లు అందించాలని కోరారు.

ఉపాధి హామీ పథకంలో ఫోటో క్యాప్చర్ విధానం కారణంగా అనేక మంది కూలీలు పనికి దూరమవుతున్నారని పేర్కొంటూ, రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలోనే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అలాగే కొత్త చట్టం ద్వారా ఉపాధి పథకంలో కేంద్రం-రాష్ట్రాల నిధుల వాటాను మార్చి రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. గతంలో ఉన్న విధానాన్నే కొనసాగించాలని కోరారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, యూనిఫాం సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల బీమాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మద్దతు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలని కోరారు. అలాగే కార్మికులకు సంబంధించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజయ్య, సీఐటీయూ మండల నాయకులు బాబురావు, కంపెనీల యూనియన్ నాయకులు శ్రీధర్, పరమేష్, వేణురెడ్డి, నాయకులు గోపాల్, మధు, వెంకయ్య, శారద, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**చేర్యాల/కొమురవెల్లి, జులై 01 (జనంసాక్షి):** చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన నర్ర రాజిరెడ్డి కుమారుడి వివాహావేడుక చేర్యాల పట్టణంలోని వరుణ్ వైష్ గార్డెన్స్‌లో హాజరై అనంతరం కొమురవెల్లి మండల కేంద్రంలో పద్మశ్రీ గార్డెన్స్‌లో మండల బాబు కుమార్తె వివాహ వేడుకలో ముఖ్య అతిథిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపి వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ ఫామ్‌లపై గ్రామస్తులకు అవగాహన

**- కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్**



**మునిపల్లి, జులై 1 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ముగ్దంపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సర్ ఓటర్ ఫామ్‌లు పంపిణీ చేసి ఫామ్ పూర్తి ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఫామ్‌లకు సంబంధించిన వివరాలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించాలని గ్రామస్తులకు తెలిపారు.అధికారులు ఫాంలను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- డిఎం అండ్ హెచ్ఓ డా.లలితా దేవి...**



**నారాయణఖేడ్, జూలై 01 (జనంసాక్షి):** వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమయపాలన పాటించాలని డిఎం అండ్ హెచ్ ఓ డా.లలితా దేవి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు వివిధ పిహెచ్సి లను, సబ్ సెంటర్ లను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పిహెచ్సి నిజాంపేట్, సబ్ సెంటర్ మాసన్ పల్లి, పిహెచ్‌సి కల్హేర్, సబ్ సెంటర్ సుల్తానాబాద్, పి హెచ్ సి సిర్గాపూర్, తుర్కపల్లి లలో రికార్డలను పరిశీలించి తగు సూచనలు అందించారు. అనంతరం మునిసిపాల్ ఆఫీస్ లో సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్సిడి, మలేరియా ఆరోగ్యం ఎప్పటి కప్పుడు డైలీ అప్డేట్ చెయాలని, ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.శశాంక్ డి ఐ ఓ, డా.నాగనిర్మల, డా.అరుణకుమారి డిటిసి ఓ, డా. దీప్తి ఎన్సిడి, డా. ప్రవీన్ కుమార్ డిఎంఓ ఇంచార్జి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, మెడికల్ ఆఫీసర్ లు, ఎమ్మెల్హెచ్ పిలు, రిపోర్టింగ్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## గుగ్గిల గ్రామంలో 12 సీసీ కెమెరాలు ప్రారంభించిన సీఐ విద్యాసాగర్



**బెజ్జంకి,జూలై 1,(జనంసాక్షి):** మండలం లోని గుగ్గిళ్ళ గ్రామంలో సురక్షా నేత్ర కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను బుధ వారం సిద్ధిపేట రూరల్ సీఐ. విద్యాసాగర్, ఎస్ఐ. తిరుపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.దొంగతనాలు,చోరీలు,ఇతర నేరాల నివారణతో పాటు నేరస్తులను గుర్తించడం,వారి కదలికలను పర్యవేక్షించడం,దర్యాప్తుకు అవసరమైన ఆధారాలను సేకరించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని,నేరస్తుల్లో భయం నెలకొంటుందని అన్నారు.మండలంలోని ప్రజలు తమ ఇళు ్ల,వ్యాపార సంస్థలు,ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని అన్నారు.సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ 12 సీసీ కెమెరాలు గుగ్గిళ్ళ గ్రామ పరిరక్షణలో ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై తిరుపతి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కమలోద్దీన్ పూర్ బోనాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**- ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలి ఎమ్మెల్యే**



**ఖిల్లా ఘనపురం 01,జులై, (జనంసాక్షి):** మండల పరిధిలో కమలోద్దీన్ పూర్ గ్రామంలో బుధవారం బొడ్రాయి,బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి బోనాల పండుగలో స్థానిక శాసన సభ్యులు మేఘా రెడ్డి రావడంతో గ్రామాల్లో ఉన్న ప్రజలు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు గ్రామస్థులు చేపట్టిన బొడ్రాయి ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు అనంతరం గ్రామంలో ఉన్న ఎల్లమ్మ ,పోచమ్మ దేవాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ,బోనాల వేడుకలో పాల్గొనడం అమ్మవారులను దర్శించుకోవడం ఆ భగవంతున్ని కృపే అని గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆకాక్షించారు ఆయన
వెంట డి. సి .సి. ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డి,సోలిపూర్ రవీందర్ రెడ్డి,సింగల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత,సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య,
స్థానిక సర్పంచ్, గోపాల్,రామకృష్ణ రెడ్డి,బాలకృష్ణ రెడ్డి,మామిడిమడ వెంకట్రావు,ఆగారం ప్రకాష్,గంజాయి రమేష్, తదితరులు పాల్గొన్నారు.కమలోద్దీన్ పూర్ బోనాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి బోనాల వేడుకలో పాల్గొనడం అమ్మవారులను దర్శించుకోవడం ఆ భగవంతున్ని కృపే అని గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆకాక్షించారు ఆయన వెంట డి. సి .సి. ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డి,సోలిపూర్ రవీందర్ రెడ్డి,సింగల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత,సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య, స్థానిక సర్పంచ్, గోపాల్,రామకృష్ణ రెడ్డి,బాలకృష్ణ్,గంజాయి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్,జులై 01(జనంసాక్షి):** మొగుడంపల్లి మండలంలో అభివృధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా జాడి మల్కాపూర్ గ్రామంలో భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ప్రతి అర్హుడైన ఓటరికి అందజేసి, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని బి ఆర్ యస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు...భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మాణిక్ రావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ,మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం,గ్రామ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ ఏజాస్ పటేల్,నాయకులు వెంకట్ రెడ్డి,భరత్ రెడ్డి,భాగన్న,శ్రీనివాస్,వార్డ్ మెంబర్ లు రాములు,రుక్మిణి మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు,దీూూ లు తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ-సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా**

**- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్**

**- భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి**

**- మూడు ప్రధాన డిమాండ్లతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం**


**వనపర్తి రూరల్, జూలై 01, (జనంసాక్షి):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని, భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి, సీపీఎం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి మూడు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు రమేష్, శ్రీరామచంద్రుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి. జబ్బార్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా, ఇప్పటికీ స్థలాలు చూపించకపోవడం అన్యాయమని విమర్శించారు. వనపర్తి సర్వే నంబర్ 974, అప్పాయిపల్లి శివారు ప్రాంతాల్లో వామపక్షాల పోరాట ఫలితంగా 2008లో 685 మందికి పట్టాలు మంజూరు చేసినప్పటికీ, వారికి ఇప్పటికీ స్థలాలు అందలేదని పేర్కొన్నారు. చిట్యాల శివారులో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని, అక్కడ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తర్వాత మిగిలిన ప్రభుత్వ భూమిని పట్టాదారులకు కేటాయించాలని కోరారు. అమరచింతలో 1987లో 350 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా, నేటికీ స్థలాలు చూపలేదని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు వెంటనే స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా శంకరసముద్రం, బండరాయిపాకుల, బుద్ధారం తదితర ప్రాంతాల్లో భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులు ఇంకా పూర్తికాలేదని, ఆలస్యం చేయకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాలకృష్ణ, రవీందర్, లక్ష్మీనారాయణ, పృథ్వీనాథం, సీపీఎం నాయకులు డి. బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు, వెంకటరాములు, వెంకటయ్య, డి. కురుమయ్య, నందిమల్ల రాములు పాల్గొన్నారు.

## సిసి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన చైర్మన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్



**సదాశివపేట జూలై 1(జనంసాక్షి):** సదాశివపేట మున్సిపాలిటీ 23వ వార్డులో సీసీ రోడ్డు పనులు, బోరు మోటార్లను మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రియ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లక్ష్మీప్రియ భరత్, వార్డు ఇన్‌చార్జి శరత్ చంద్ర మాట్లాడుతూ 20 ఏళ్లుగా కొనసాగుతున్న రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శివాజీ, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాలి పటేల్ శివకాంత్ జన్మదిన వేడుకలు



**నాగల్గిద్ద జులై 01 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాలి పటేల్ శివకాంత్ జన్మదిన వేడుకలు బుధవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. తోటి కాంగ్రెస్ నాయకులు మండలాల అధ్యక్షులు సర్పంచులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని మాలి శివకాంత్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాగల్గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాణిక్ రావు పటేల్, మానూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్ పటేల్, పిఎసియస్ చైర్మన్ శ్రీకాంత్, తోర్నాల్ సర్పంచ్ సంగమేశ్ పటేల్, కమలాపూర్ సర్పంచ్ రమేశ్,పండు, నారాయణ రెడ్డి, బక్షీరం, మురళి పటేల్ పాల్గొన్నారు.

## మధుర జ్ఞాపకాన్ని చెరిపేస్తారా...

**- 70 యేళ్ళ గుర్తులను తొలగించడం ఏమిటీ..?**

**- ఎవరి ప్రయోజనాల కోసం... గ్రామస్తుల మండిపాటు**



**మెదక్ బ్యూరో చీఫ్, జులై 1 (జనంసాక్షి):** మెదక్ మండలం మాచవరం గ్రామంలో 70 సంవత్సరాలుగా గ్రామ కూడలి వద్ద పూరి గుడిసె ఉంది. దాన్ని గ్రామస్తులు మరుపురాని జ్ఞాపకంగా కాపాడుతున్నారు. ఇటీవల గ్రామ సర్పంచ్ ఎలాంటి అనుమతులు లేకుండా ఆ గుడిసె కూల్చివేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులకు ఎన్నో జ్ఞాపకాలు, మధుర స్మృతులు, వృద్ధులకు కాలక్షేపం కబుర్లు చెప్పుకునే వేదికగా ఆ గుడిసెను కుంటి సాకులతో కూల్చడం ఏమిటని మండిపడు తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మానం లేకుండా గుడిసెను కూల్చడం పట్ల ఎన్‌ఆర్‌ఐలు సైతం ఆవేదన వ్యక్తం చేస్తూ్నరు. సర్పంచ్ ఏక పక్ష నిర్ణయాలపై గ్రామస్తులు మండి పడుతున్నారు. ఈ గుడిసె కూల్చడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఏకపక్ష నిర్ణయంతో చిరకాల స్వప్నమైన గుడిసెను ఎందుకు కూల్చాల్సి వచ్చిందో సర్పంచ్ సమాధానం చెప్పాలని పేర్కొంటున్నారు. సర్పంచ్ నిర్లక్ష్య ధోరణిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంప్రదించే ప్రయత్నం చేయగా సర్పంచ్‌గాని, కార్యదర్శిగాని అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

# రైతులు, అధికారుల సమన్వయంతో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే 1,18,000 మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు
- జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ
- రైతుల అకౌంట్లలో రూ.1004.13 కోట్ల రూపాయలు జమ
- 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో చీఫ్, జూలై 1 (జనంసాక్షి): రైతులు, అధికారుల సమన్వయంతో వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్, అదనపు ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, వ్యవసాయ ,సివిల్ సప్లై గ్రామీణ అభివృద్ధి ,పోలీసు శాఖల తో ధాన్యం కొనుగోలు విజయవంతం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రైతులు, అధికారుల సమన్వయంతో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. హమాలీ, రవాణా ,రైస్ మిల్లుల్లో ధాన్యం నిలువ చేయడానికి స్థలం లేకపోవడం, అకాల వర్షాలు,లోడింగ్, అన్లోడింగ్ లాంటి సమస్యలను అధిగమించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామని, యాసంగి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ప్రణాళికలు చేయాలన్నారు. ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని,జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1004.13 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు.1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి అధికారులు జిల్లా యంత్రాంగం,గతంలో ఎన్నడూలేని విధంగా విస్తృతంగా రైతులకు సేవలు అందించారన్నారు. ఏప్రిల్ 10న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 29వ తేదీకి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ -305, ఐకేపీ-185, డీసీఎంఎస్- 43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.1004.13 కోట్లు జమ చేశామన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు లో అదిక సమస్యలని అధిగమించి పూర్తి చేశామన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ చొరవ, సమీక్షలు, క్షేత్ర పర్యటనలు, సమీక్షలతో 100 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..ధాన్యం సేకరణలో పోలీస్ యంత్రాంగం చాలా బాగా పని చేసిందని, రైతులు చాలా బాగా సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు, రామ కృష్ణ,బావయ్య,జిల్లా సివిల్ సప్లై అధికారులు నిత్యానంద, జగదీష్ వ్యవసాయ అధికారి దేవకుమార్,రవాణా శాఖ అధికారి అశోక్ చక్రవర్తి, డి, ఎస్పీ లు , సిఐ లు, తహశీల్దార్లు, ఎస్ ఐ లు ,తదితరులు పాల్గొన్నారు.

# రూ.5.75 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి



కొండాపూర్, జూలై 1 (జనంసాక్షి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి కలిసి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు సతీష్, రాజు, జానయ్య, వినీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలి

- సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్



సదాశివపేట జూలై1 (జనంసాక్షి): వన మహోత్సవంలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగ్య స్వాములు కావాలని వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం భాగంగా బుధవారం వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరి రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచా యతీ కార్యదర్శి ఇమ్రాన్, ఉపసర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు జనార్ధన్, నర్సింలు, నవీన్, నరేందర్, మల్లేశం పాల్గొన్నారు.

# బిఎల్ ఏలకు సర్ మీద అవగాహన..

- అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగకూడదు: మంత్రి వివేక్



రామచంద్రాపురం,జూలై 1 (జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. రామచంద్రాపురంలోని బాలాజీ గార్డెన్స్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 2002 ఓటర్ల డేటా మ్యాపింగ్‌తో పాటు అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎలాంటి అర్హ ఓటరు పేరు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ వెన్నెల, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.



# మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ



బెజ్జంకి, జూలై 1,(జనంసాక్షి): మండలం లోని గాగిల్లాపూర్ గ్రామంలోని ఒకటో వార్డులో నూతనంగా నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పులి కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది అనీ అన్నారు.సర్పంచ్ ఎర్రల జానకిరాజు చొరవతో ఒకటో వార్డులో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తైంది అనీ అన్నారు. దీనిద్వారా వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయని తెలిపారు. భవిష్యత్తులో గాగిల్లాపూర్ గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.సర్పంచ్ ఎర్రల జానకిరాజు మాట్లాడుతూ ఒకటో వార్డు ప్రజల త్రాగునీటి చిరకాల కోరిక నెరవేరింది అనీ అన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ సహకారంతో ఈ ట్యాంక్ నిర్మాణం సాధ్యమైంది అనీ,గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ,వార్డు సభ్యులు బండిపెల్లి రమేష్,చింతలపల్లి లతా-కొండల్ రెడ్డి,బొమ్మరవేణి వాసవి-వెంకటేష్,సొల్లు బాలయ్య,న్యాలం శారద-శ్రీనివాస్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గర్రెపల్లి అంజయ్య,బొమ్మరవేణి సంతోష్, పంచాయతీ కార్యదర్శి పాము రాజేంద్రప్రసాద్,గ్రామ పెద్దలు,నాయకులు,మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం.. రూల్స్‌కు బేఖాతరు!

- రోడ్లపై అడ్డగోలుగా వాహనాల నిలుపుదల
- పోస్ట్ ఆఫీస్ గల్లి, గవర్నమెంట్ కాలేజ్ గల్లిలో నిత్య నరకం
- బస్టాండ్ దగ్గర చిన్న ఆటోలతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం
- కూరగాయల మార్కెట్ తోడు ప్రతిరోజూ ప్రజలకు ఇక్కట్లు

కల్వకుర్తి,జూలై 01,(జనంసాక్షి): కల్వకుర్తి పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందా..? ప్రజల ఇబ్బందులను పట్టించుకునే అధికారులు ఉన్నారా..? అనే ప్రశ్నలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రధానరహదారులనుంచిసందులవరకుఎక్కడ చూసినా అడ్డగోలుగా నిలిపిన వాహనాలు, రోడ్లపైనే సాగుతున్న వ్యాపారాలు,ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోని వాహనదారుల తీరు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

**పోస్ట్‌ఆఫీస్ ముందు..గల్లీలో పరిస్థితిదారుణం...**

పోస్ట్ ఆఫీస్ గల్లిలో పరిస్థితి అయితే మరింత దారుణంగా మారిందనిస్థానికులువాపోతున్నారు. రహదారి ఇరువైపులా వాహనాలు నిలిపివేయడంతో నడిచే వారికి కూడా చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని చెబుతున్నారు. గవర్నమెంట్ కాలేజ్ పక్క గల్లిలో రహదారినే ఆక్రమించి వ్యాపారం సాగుతున్నా అధికారులకు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు,మహిళలు,వృద్ధులు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నా చర్యలు మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



**బస్టాండ్ దగ్గర ట్రాఫికర్ బాబోయ్...**

ఇక బస్టాండ్ ప్రాంతం ట్రాఫిక్ కష్టాలకు కేంద్రంగా మారింది. చిన్న ఆటోలు రహదారులపై ఎక్కడపడితే అక్కడ నిలబడటం,ప్రయాణికుల కోసం పోటీ పడటం,రోడ్డుమధ్యలోనే ఆగిపోవడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారాయి.పీక్ అవర్స్‌లో అయితే వాహనాలు కదల లేని పరిస్థితి నెలకొంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కూరగాయల మార్కెట్ రోడ్ లో పరిస్థితి దారుణం...**

కూరగాయల మార్కెట్ పరిసరాల్లో పరిస్థితి మరి దారుణంతలనొప్పిగా మారింది.మార్కెట్ రోజుల్లో వ్యాపారులు,కొనుగోలుదారులు,వాహనాల రద్దీతో రహదారులు కిక్కిరిసిపోతున్నాయి.కూరగాయల లోడ్లు దింపడం,రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచే వారికి కూడా దారి లేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు.ట్రాఫిక్ సమస్యలపై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత శాఖలు స్పందించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# రాంజీ బిల్లును రద్దు చేయాలని డిమాండ్

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్

తెలకపల్లి, జూలై 01, (జనంసాక్షి): మండలం పరిధి లోని కర్వంగ, గడ్డంపల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నందిపేట భాస్కర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసివేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. పేదలకు మేలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రజలకు దూరం చేయాలని, రద్దు చేయాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. విజిబి రామ్ జి చట్టాన్ని వెనక్కి తీసుకోపోతే కూలీలను సమీకరించి ముందు ముందు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు వెంకటయ్య పరశురాములు వెంకటమ్మ చిన్నమ్మ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు